# 27. అన్ నమ్ల్ (చీమలు) సూరా

## పరిచయం

ఇది మక్కా కాలంలో అవతరించిన సూరా. దీనిలో 93 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ లేపబడడం వంటి మౌలిక విశ్వాసాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. ఈ సూరాలోని 18వ ఆయత్‌లో ప్రస్తావనకు వచ్చిన చీమల వల్ల దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరా దివ్యఖుర్ఆన్‌ను ఒక మార్గదర్శక గ్రంథంగా, మానవాళికి కారుణ్యంగా, హెచ్చరిక చేసే గ్రంథంగా వర్ణించింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ పంపిన సందేశహరుడనీ, ఆయన హెచ్చరిక చేసే వానిగా వచ్చారని తెలిపింది. మరణానంతర జీవితాన్ని, పరలోకాన్ని తిరస్కరించే అవిశ్వాసుల గురించిన ప్రస్తావనలు కూడా ఇందులో ఉన్నాయి.

ఈ సూరాలో మానవాళికి హితబోధ గరపడానికి గాను గతకాలాలకు చెందిన ప్రవక్తల కథలను ప్రస్తావించడం జరిగింది. మూసా (అస) గురించి, ఆయన తన కుటుంబంతో కలిసి ప్రయాణిస్తున్నప్పుడు సినాయ్‌లో ఆయన చూసిన అగ్ని గురించి ఇందులో తెలుపడం జరిగింది. వెలుగుకు, మార్గదర్శనానికి చిహ్నం ఆ అగ్ని. అల్లాహ్ మూసా(అస)తో సంభాషించాడు. ఆయన చేతికర్రను క్రిందికి విసిరేయమన్నాడు. ఆ కర్ర ఒక పాముగా మారిపోయింది. మూసా(అస) చేతిని తన చొక్కా లోపల పెట్టుకోమన్నాడు. ఆ చెయ్యి మెరిసిపోసాగింది.

ఈ సూరాలో సులైమాన్(అస) కథ కూడా ప్రస్తావించడం జరిగింది. ముఖ్యంగా షీబా (సబా) రాణితో సమావేశం గురించి ప్రస్తావన ఉంది.

# 27. అన్ నమ్ల్[1] సూరా

## سُوْرَةُ النَّمْلِ

అవతరణ :మక్కా ఆయతులు : 93

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** తా – సీన్. ఇవి ఖుర్ఆన్ ఆయతులు– స్పష్టమైన గ్రంథానికి చెందినవి.

طٰسٓ تِلْكَ اٰيٰتُ الْقُرْاٰنِ وَكِتَابٍ مُّبِيْنٍ ①

**2** విశ్వసించిన వారికి మార్గదర్శకం, శుభవార్త.

هُدًى وَّبُشْرٰى لِلْمُؤْمِنِيْنَ ②

**3** వారు (విశ్వాసులు) నమాజును నెలకొల్పుతారు, జకాతును ఇస్తారు, పర లోకాన్ని నమ్ముతారు.[2]

الَّذِيْنَ يُقِيْمُوْنَ الصَّلٰوةَ وَيُؤْتُوْنَ الزَّكٰوةَ وَهُمْ بِالْاٰخِرَةِ هُمْ يُوْقِنُوْنَ ③

**4** ఎవరయితే పరలోకాన్ని విశ్వసించరో వారికి మేము, వారి పనులు ఎంతో అంద మైనవిగా అనిపించేటట్లు చేశాము.[3] అందుచేత వారు దారితప్పి తిరుగు తుంటారు.[4]

اِنَّ الَّذِيْنَ لَا يُؤْمِنُوْنَ بِالْاٰخِرَةِ زَيَّنَّا لَهُمْ اَعْمَالَهُمْ فَهُمْ يَعْمَهُوْنَ ④

1. 'నమ్ల్' ( نَمْل ) అంటే చీమలు అని అర్థం. ఈ సూరాలో చీమల సంఘటన రావటం వల్ల దీనికి నమ్ల్ అనే పేరు వచ్చింది.
2. ఈ విషయం ఖుర్ఆన్‌లో అనేకచోట్ల వచ్చింది. దివ్య ఖుర్ఆన్ వాస్తవానికి సమస్త మానవుల మార్గదర్శకత్వం కోసం అవతరించింది. అయితే నిజంగా మార్గదర్శకత్వాన్ని ఆశించేవారే ఈ గ్రంథం ద్వారా సన్మార్గం పొందుతారు. తమ హృదయ కవాటాలను మూసివేసి, అంధకారంలో తచ్చాడగోరిన వారికి దివ్య ఖుర్ఆన్ ఎలా మార్గం చూపుతుంది? వారి ఉపమానం సూర్యుని వెలుగుతో లబ్ది పొందజాలని అంధుల వంటిది. సూర్యుడు మాత్రం యావత్తు ప్రపంచాన్ని ప్రకాశవంతం చేయదలుస్తున్నాడు.
3. వారి నిరంతర పాపాల కారణంగా వారికీ దుస్థితి ఏర్పడుతుంది. వారు చేసే ప్రతి దుష్కార్యం వారి కంటికి అపురూపంగా కనిపిస్తుంది. పరలోకంపై వారికి గల అపనమ్మకమే వారి ఈ దురవస్థకు మూలకారణం. ఈ వ్యవహారంలో కూడా దైవప్రణాళిక ఒక్కటే – దుర్మార్గులకు దుర్మార్గంలో, సన్మార్గులకు సన్మార్గంలో మార్గాన్ని సుగమం చేయటం ఆయన విధానం. రెండు మార్గాలు తన ముందున్నప్పుడు వాటిలో ఏ మార్గాన్ని ఎంచుకోవాలనేది మనిషి స్వేచ్ఛాధికారానికి వదిలిపెట్టబడింది.
4. అంటే–వారు పయనించే అపమార్గంలోని వాస్తవికత వారికి తెలిసిరాదు. అందువల్ల వారు అపమార్గం నుంచి సన్మార్గం వైపుకు రాలేకపోతారు.

**5** చెడ్డ శిక్షను పొందేవారు వీరే. పరలోకంలో కూడా వారు తీవ్రమైన నష్టాన్ని పొందుతారు.

أُولَٰئِكَ الَّذِينَ لَهُمْ سُوءُ الْعَذَابِ وَهُمْ فِي الْآخِرَةِ هُمُ الْأَخْسَرُونَ ۝٥

**6** (ఓ ప్రవక్తా!) వివేచనాపరుడు, జ్ఞాన సంపన్నుడైన అల్లాహ్ తరఫు నుంచి నీకు ఖుర్ఆన్ బోధించబడుతున్నది.

وَإِنَّكَ لَتُلَقَّى الْقُرْآنَ مِن لَّدُنْ حَكِيمٍ عَلِيمٍ ۝٦

**7** మూసా తన ఇంటివారితో, "నేను అగ్నిని చూశాను. నేను అక్కణ్ణుంచి ఏదైనా సమాచారంగానీ లేదా మీరు (చలి) కాచుకోవటానికి[5] నిప్పు కొరివిని గానీ తెస్తాను" అని చెప్పినప్పటి విషయం (జ్ఞాపకమేనా?!)

إِذْ قَالَ مُوسَىٰ لِأَهْلِهِ إِنِّي آنَسْتُ نَارًا سَآتِيكُم مِّنْهَا بِخَبَرٍ أَوْ آتِيكُم بِشِهَابٍ قَبَسٍ لَّعَلَّكُمْ تَصْطَلُونَ ۝٧

**8** తీరా అతను అక్కడకు చేరుకోగానే పిలుపు (విన)వచ్చింది : "ఈ అగ్నిలో ఉన్నవాడు, శుభవంతుడు,[6] దాని చుట్టు

فَلَمَّا جَاءَهَا نُودِيَ أَن بُورِكَ مَن فِي النَّارِ وَمَنْ حَوْلَهَا

5. దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తన ధర్మపత్నిని మద్యన్ ప్రదేశం నుంచి వెంటబెట్టుకుని తన స్వదేశానికి తిరిగి వస్తున్నప్పుడు ఎదురైన సంఘటన ఇది! రాత్రి సమయం. అంతా చీకటి. దారి తెలీదు. మరో వైపు చలి తీవ్రంగా ఉంది. ఆ సమయంలో వారికి చలిమంటలు అవసరమయ్యాయి.

6. బహుదూరాన అగ్ని జ్వాలల్లాంటివి కనిపించాయి. ఆయన అక్కడికి–అంటే తూరు పర్వతంపైకి చేరుకున్నారు. అక్కడ ఒక ఆకుపచ్చని వృక్షం నుండి అగ్నిజ్వాలలు పైకి లేవటం ఆయనకు కానవచ్చింది. నిజానికి అది అగ్ని కాదు– అల్లాహ్ జ్యోతి. దాని తేజస్సు అగ్ని మాదిరిగా దేదీప్యమానంగా ఉంది. **'మన్ ఫిన్నారి"** ( مَن فِي النَّارِ ) అని అరబీలో ఉంది. 'మన్' అంటే అల్లాహ్, 'నార్' అంటే అల్లాహ్ జ్యోతి అని భావం. **"వ మన్ హౌలహా"** అంటే 'దాని పరిసరాలలో' అని అర్థం. పరిసరాలలో ఉన్నవారెవరు? అంటే హజ్రత్ మూసా (అలైహిస్సలాం) మరియు దైవదూతలు. హదీసులో అల్లాహ్ అస్థిత్వ తెరను 'జ్యోతి'గా పేర్కొనటం జరిగింది. వేరొక ఉల్లేఖనంలో అది 'అగ్ని'గా అభివర్ణించబడింది. "ఒకవేళ ఆయన (అల్లాహ్) గనక తనపై ఉన్న తెరను తొలగిస్తే ఆయనలోని తేజస్సు సమస్త సృష్టితాలను కాల్చి భస్మీపటలం చేసేస్తుంది" అని చెప్పబడింది (సహీహ్ ముస్లిం–కితాబుల్ ఈమాన్. వివరాల కోసం చూడండి: ఫతావా ఇబ్నె తైమియ – సంపుటి : 5; పేజీ – 459 – 464).

وَسُبْحٰنَ اللّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ﴿٨﴾

ప్రక్కల ఉన్న వారికి శుభము వొసగ బడింది. సర్వలోకాల పోషకుడైన అల్లాహ్ పవిత్రుడు.[7]

يٰمُوْسٰٓى اِنَّهٗٓ اَنَا اللّٰهُ الْعَزِيْزُ الْحَكِيْمُ ﴿٩﴾

**9** "ఓ మూసా! విను! సర్వశక్తుణ్ణి, వివేక వంతుణ్ణి అయిన అల్లాహ్‌ను నేనే.[8]

وَاَلْقِ عَصَاكَ ۭ فَلَمَّا رَاٰهَا تَهْتَزُّ كَاَنَّهَا جَاۗنٌّ وَّلّٰى مُدْبِرًا
وَّلَمْ يُعَقِّبْ ۭ يٰمُوْسٰى لَا تَخَفْ ۣ اِنِّىْ لَا يَخَافُ لَدَيَّ
الْمُرْسَلُوْنَ ﴿١٠﴾

**10** "నీ చేతి కర్రను పడవెయ్యి." ఆ తరువాత అదొక పాము మాదిరిగా ప్రాకుతూ ఉండటం చూచి మూసా వెన్ను చూపి పారిపోయాడు. వెనక్కి తిరిగి చూడ నయినా లేదు. "ఓ మూసా! భయపడకు. నా ముందర ప్రవక్తలు భీతి చెందరు.[9]

اِلَّا مَنْ ظَلَمَ ثُمَّ بَدَّلَ حُسْنًۢا بَعْدَ سُوْۗءٍ فَاِنِّىْ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿١١﴾

**11** "కాని తప్పు చేసిన వారు (మాత్రం భయపడతారు.)[10] మరి ఆ తరువాత ఆ దుష్కార్యానికి బదులుగా సత్కార్యం చేస్తే నేను క్షమించేవాడను, కనికరించే వాడను.[11]

7. ఈ అగోచర పిలుపును ఆధారంగా చేసుకుని ఈ అగ్ని లేక వృక్షంలో అల్లాహ్ ప్రవేశించాడని భావించరాదు సుమా! చాలామంది ముష్రిక్కులు ఇలాంటి విషయాల్లోనే పొరబడుతుంటారు. అందుకే ఇలాంటి మాటలకు అల్లాహ్ పవిత్రుడని చెప్పబడింది. నిజానికి ఈ సంఘటన ఓ సత్య స్వరూపం. సాధారణంగా దైవప్రవక్తలకు దేవుడు ఇలాంటి అవకాశాలను కల్పిస్తుంటాడు. ఒక్కోసారి దైవదూత ద్వారా ఇలాంటి భాగ్యం కల్పిస్తాడు. ఒక్కోసారి స్వయంగా దేవుడే తన తేజస్సు ద్వారా, తన సంభాషణ ద్వారా తన ప్రవక్తలకు సువర్ణావకాశం కల్పిస్తాడు. మూసా(అలైహిస్సలాం)కు ఎదురైన ఈ సంఘటనే ఇందుకు ప్రబల తార్కాణం.

8. ఒక వృక్షం నుంచి పిలుపు రావటం హజ్రత్ మూసా (అలైహిస్సలాం) కొరకు వింత విషయమే. "మూసా! ఆశ్చర్యపడకు. నేను అల్లాహ్‌ను" అని ఆయన సెలవిచ్చాడు.

9. దీన్నిబట్టి దైవప్రవక్తలకు రహస్య విషయాల జ్ఞానం ఉండదని అర్థమవుతోంది. ఒకవేళ ఆ జ్ఞానం ఉండి ఉంటే హజ్రత్ మూసా తన చేతి కర్రకు భయపడేవారు కారు. మరో విషయం – భయపడటం అనేది మానవ సహజం. ప్రవక్తలు కూడా మానవ మాత్రులే.

10. అన్యాయం, అక్రమాలకు పాల్పడిన వారు అల్లాహ్‌కు భయపడాల్సిందే. ఎందుకంటే అన్యాయపరులను అల్లాహ్ పట్టుకుని తీరుతాడు.

11. అయితే అన్యాయానికి ఒడిగట్టినవాడు పశ్చాత్తాపం చెందితే అల్లాహ్ అటువంటి పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు కూడా.

وَاَدْخِلْ يَدَكَ فِيْ جَيْبِكَ تَخْرُجْ بَيْضَآءَ مِنْ غَيْرِ سُوْٓءٍ فِيْ تِسْعِ اٰيٰتٍ اِلٰى فِرْعَوْنَ وَقَوْمِهٖ ؕ اِنَّهُمْ كَانُوْا قَوْمًا فٰسِقِيْنَ ﴿۱۲﴾

**12** “నీ చేతిని నీ చొక్కా లోపల పెట్టుకో– అది ఎలాంటి లోపం లేకుండా ప్రకాశిస్తూ బయటికి వస్తుంది.[12] నువ్వు తొమ్మిది నిదర్శనాలను తీసుకుని ఫిర్ఔన్ మరియు అతని జాతి వారి వద్దకు వెళ్ళు.[13] నిశ్చయంగా వారు పరమ అవిధేయులు.”

فَلَمَّا جَآءَتْهُمْ اٰيٰتُنَا مُبْصِرَةً قَالُوْا هٰذَا سِحْرٌ مُّبِيْنٌ ﴿۱۳﴾

**13** మరి కళ్లు తెరిపించే[14] మా సూచనలు వారి వద్దకు చేరిన తరువాత కూడా “ఇది స్పష్టమైన ఇంద్రజాలం” అని వారు తేలిగ్గా కొట్టేశారు.

وَجَحَدُوْا بِهَا وَاسْتَيْقَنَتْهَآ اَنْفُسُهُمْ ظُلْمًا وَّعُلُوًّا ؕ فَانْظُرْ كَيْفَ كَانَ عَاقِبَةُ الْمُفْسِدِيْنَ ﴿۱۴﴾

**14** నిజానికి వారి మనసులు (సత్యాన్ని) నమ్మినప్పటికీ అన్యాయం, అహం కారంతో వారు దాన్ని త్రోసిపుచ్చారు.[15] కాబట్టి ఆ కల్లోల జనకులకు ఏ గతి పట్టిందో చూడు!

وَلَقَدْ اٰتَيْنَا دَاوٗدَ وَسُلَيْمٰنَ عِلْمًا ۚ وَقَالَا الْحَمْدُ لِلّٰهِ الَّذِيْ

**15** నిశ్చయంగా మేము దావూదు, సులైమానులకు జ్ఞానాన్ని వొసగాము.[16] “విశ్వాసులైన తన దాసులెందరిపైనో మాకు

12. ‘ఎలాంటి లోపం లేకుండా’ అంటే అర్థం చేతికి బొల్లి, తెల్లమచ్చల వ్యాధిలాంటివి ఏమీ లేకుండానే అది తెల్లగా కనిపిస్తుంది. చేతి కర్రతో పాటు ఇది రెండవ మహిమ.

13. ఈ రెండు మహిమలతో కలుపుకుని మొత్తం 9 మహిమలు నీకు ఇవ్వబడ్డాయి. వీటిని తీసుకుని ఫిరౌన్ వద్దకు, అతని జనుల వద్దకు వెళ్ళు. (ఈ తొమ్మిది సూచనల వివరాల కోసం బనీ ఇస్రాయీల్ సూరా 101వ ఆయతు క్రింద ఇవ్వబడిన వివరణను చూడండి).

14. **‘ముబ్‌సిరతన్’** ( مُبْصِرَةً ) అంటే కళ్లు తెరిపించే, సుస్పష్టమైన అనే అర్థాలు వస్తాయి.

15. యదార్థం ముందుకు వచ్చేసిన తరువాత కూడా వారు సత్యాన్ని తృణీకరించారంటే దానికి ప్రధాన కారణం వారిలో తిష్ఠవేసివున్న అన్యాయం, అహంకారాలే. ఈ రెండు చెడుగులే సదా జాతుల పతనానికి మూల కారణంగా నిలిచాయి.

16. ఈ ఖుర్ఆన్ అల్లాహ్ తరఫున నేర్పబడుతుందని సూరా ఆరంభంలో చెప్పబడింది. దీనికి ఒక నిదర్శనంగా మొదట హజ్రత్ మూసా (అలైహిస్సలాం) గాథ సంక్షిప్తంగా వివరించబడింది. మరో నిదర్శనంగా హజ్రత్ దావూదు, హజ్రత్ సులైమాను

فَضَّلَنَا عَلٰى كَثِيْرٍ مِّنْ عِبَادِهِ الْمُؤْمِنِيْنَ ﴿١٥﴾

وَوَرِثَ سُلَيْمٰنُ دَاوٗدَ وَقَالَ يٰٓاَيُّهَا النَّاسُ عُلِّمْنَا مَنْطِقَ
الطَّيْرِ وَاُوْتِيْنَا مِنْ كُلِّ شَيْءٍ ۭ اِنَّ هٰذَا لَهُوَ الْفَضْلُ الْمُبِيْنُ ﴿١٦﴾

ప్రాధాన్యతను వొసగిన అల్లాహ్‌కు సర్వస్తోత్రాలు" అని వారిద్దరూ పలికారు.

**16** సులైమాను దావూదుకు వారసుడయ్యాడు.[17] అతను ఇలా అన్నాడు : "ఓ ప్రజలారా! మాకు పక్షుల భాష నేర్పబడింది.[18] ఇంకా మాకు ప్రతిదీ ప్రసాదించబడింది.[19] ముమ్మాటికీ ఇది స్పష్టమైన దైవానుగ్రహమే."

(అలైహిముస్సలాం)ల వృత్తాంతం ప్రస్తావించబడింది. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) చెప్పేది అంతా అక్షర సత్యం అనటానికి దైవప్రవక్తల ఈ గాథలే ప్రబల సాక్ష్యాలు. 'జ్ఞానం' వొసగటం అంటే దైవదౌత్య జ్ఞానంతో పాటు హజ్రత్ దావూద్ మరియు సులైమాన్ ప్రవక్తలకు ప్రసాదించబడిన ప్రత్యేక జ్ఞానం అని అర్థం. ఉదా : దావూద్ ప్రవక్తకు ఇనుముతో వస్తువులను తయారుచేసే తెలివితేటలు ప్రసాదించబడ్డాయి. సులైమాన్ ప్రవక్త పశుపక్ష్యాదుల భాషల్ని అర్థం చేసుకోగలిగేవారు. ఈ తండ్రీ కొడుకులిరువురికీ – ఎన్నో విషయాలలో – ఇతరులెవరికీ ఇవ్వబడనివి ఇవ్వబడ్డాయి. అయినప్పటికీ ఇక్కడ ఇల్మ్ (జ్ఞానం) గురించి ప్రత్యేకంగా నొక్కి చెప్పటాన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే దైవప్రసాదిత వస్తువులలో 'ఇల్మ్' చాలా శ్రేష్ఠమైనది.

17. వారసత్వం అంటే ప్రవక్త పదవితోపాటు, రాజరికం కూడా వస్తుంది. హజ్రత్ సులైమాను హజ్రత్ దావూదు కుమారుడు. దావూదు గారికి ఇతర కొడుకులున్నప్పటికీ ఈ వారసత్వం వారికి దక్కలేదు. కేవలం సులైమానుకు మాత్రమే ఈ విశిష్ఠస్థానం ప్రాప్తించింది. అల్లాహ్ తాను కోరిన వారికి మాత్రమే ఈ అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు. అదలావుంచితే దైవప్రవక్తలు వదలివెళ్ళే వారసత్వం ఏమై ఉంటుంది? అంటే 'జ్ఞాన సంపదే'. వారు వదలివెళ్ళే సాధనసంపత్తులు 'సదఖా' గా పరిగణించబడతాయి అని మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు చెప్పారు. (బుఖారీ – కితాబుల్ ఫరాయెజ్; ముస్లిం – కితాబుల్ జిహాద్).

18. ఆ మాటకొస్తే జంతువులన్నింటి భాష ఆయనకు నేర్పబడింది. అయితే పక్షుల భాష గురించి ప్రత్యేకంగా ఎందుకు ప్రస్తావించబడిందంటే పక్షులు – బయటకు వెడలినప్పుడల్లా – ఆకాశంలో గుంపులుగా ఎగురుతూ ఆయనకు నీడ కల్పించేవి. అయితే సులైమాన్ ప్రవక్తకు కేవలం పక్షుల భాష మాత్రమే నేర్పించబడిందని, చీమలు కూడా వాటిలోకి వచ్చేస్తాయని మరికొంతమంది అభిప్రాయపడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్).

19. అంటే వారికి అవసరమైనవల్లా ప్రసాదించబడ్డాయి. ఉదాహరణకు : జ్ఞానం, వివేకం,

**17** సులైమాను ఎదుట అతని జిన్నాతుల దళం, మనుషుల సైన్యం, పక్షుల గుంపు సమీకరించబడింది.[20] అవన్నీ (వేర్వేరుగా) వివిధ జట్లుగా మోహరించబడ్డాయి.[21]

وَحُشِرَ لِسُلَيْمٰنَ جُنُوْدُهٗ مِنَ الْجِنِّ وَالْاِنْسِ وَالطَّيْرِ فَهُمْ يُوْزَعُوْنَ ﴿١٧﴾

**18** చివరకు వారంతా ఒక చీమల లోయకు చేరుకున్నప్పుడు ఒక చీమ ఇలా ప్రకటించింది: "ఓ చీమల్లారా! సులైమాను, అతని సైన్యాలు తెలీకుండా మిమ్మల్ని నలిపివేసే స్థితి ఏర్పడకుండా ఉండేందుకు, మీరు మీ మీ పుట్టలలోనికి దూరిపోండి."[22]

حَتّٰىٓ اِذَآ اَتَوْا عَلٰى وَادِ النَّمْلِ ۙ قَالَتْ نَمْلَةٌ يّٰٓاَيُّهَا النَّمْلُ ادْخُلُوْا مَسٰكِنَكُمْ ۚ لَا يَحْطِمَنَّكُمْ سُلَيْمٰنُ وَجُنُوْدُهٗ ۙ وَهُمْ لَا يَشْعُرُوْنَ ﴿١٨﴾

దైవదౌత్యం, అధికారం, సిరిసంపదలు, మనుషుల, జిన్నాతుల, పక్షుల సైన్యాలు ఇత్యాదివి.

20. దైవప్రవక్త హజ్రత్ సులైమాను (అలైహిస్సలాం)గారి వ్యక్తిత్వం, వైశిష్ట్యం ఇక్కడ చెప్పబడింది. మానవ జాతి చరిత్రలో ఎవరికీ ఇవ్వబడని అధికారం ఆయనకు ఇవ్వబడింది. ఆయన అధికారం మానవులపైనే గాక జిన్నాతులపై, పశుపక్ష్యాదులపై కూడా సాగింది. తుదకు వాయువు కూడా ఆయనకు లోబరచబడి ఉండేది. హజ్రత్ సులైమాన్ ఆదేశంపై మనుషుల, జిన్నాతుల, పక్షుల సైన్యాలు ఆయన సమక్షంలో హాజరుపరచబడ్డాయి. ఎక్కడికో వెళ్ళటానికి ఆయన ఈ దళాలన్నిటిని సమీకరించి ఉంటారు.

21. అంటే మానవసైన్యాలను, జిన్నాతుల సైన్యాలను, పక్షుల సైన్యాలను వేర్వేరుగా వర్గీకరించి వాటికి నిర్ణీత కార్యక్రమం అప్పగించబడేది. క్రమశిక్షణ గురించి నిర్దేశించబడేది. ఎందుకంటే సైన్యం చాలా పెద్ద సంఖ్యలో ఉండేది. వాటిని వివిధ పంక్తులుగా విభజించకపోతే పరిస్థితి అస్తవ్యస్తంగా తయారవుతుంది. అసలు మూలంలో **'యూజవూన్'** (يُوْزَعُوْنَ) అన్న పదం వాడబడింది. దీనికి రెండు అర్థాలు కావచ్చు. ఒకటి వర్గీకరణ: అంటే సైన్యంలోని దళాలన్నిటిని వేర్వేరుగా వర్గీకరించటం జరిగేదన్న మాట. దీనికి మరో అర్థం 'ఆపబడటం' అని కూడా వస్తుంది. సులైమాన్ సైన్యం చాలా పెద్దది. అది అస్తవ్యస్తం కాకుండా ఉండటం కోసం మార్గమధ్యంలో సైన్యాన్ని ఆపి సరిచేయటం జరిగేదని దీని భావం.

22. జంతువులలో కూడా దూరదృష్టి, ప్రమాదాన్ని పసిగట్టే చైతన్యం ఉంటుందనటానికి ఈ వాక్యం ఒక మచ్చుతునక. అయితే ఈ చైతన్యం మనిషితో పోల్చుకుంటే చాలా తక్కువ. మరో ముఖ్య విషయం ఏమిటంటే, హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం)కు

فَتَبَسَّمَ ضَاحِكًا مِّن قَوْلِهَا وَقَالَ رَبِّ أَوْزِعْنِي أَنْ أَشْكُرَ
نِعْمَتَكَ الَّتِي أَنْعَمْتَ عَلَيَّ وَعَلَىٰ وَالِدَيَّ وَأَنْ أَعْمَلَ صَالِحًا
تَرْضَاهُ وَأَدْخِلْنِي بِرَحْمَتِكَ فِي عِبَادِكَ الصَّالِحِينَ ﴿١٩﴾

**19** దాని మాటపై సులైమాను చిరునవ్వును చిందించాడు. అతనిలా ప్రార్థించ సాగాడు : “నా ప్రభూ! నువ్వు నాకూ, నా తల్లిదండ్రులకూ ప్రసాదించిన అనుగ్రహాలకుగాను నిత్యం నీకు కృతజ్ఞతలు తెలుపుకునే సద్బుద్ధిని నాకు ఇవ్వు.[23] నేను, నీ మెప్పును పొందే మంచిపనులు చేసేలా చూడు. నీ దయతో నన్ను నీ సజ్జన దాసులలో చేర్చుకో.”[24]

وَتَفَقَّدَ الطَّيْرَ فَقَالَ مَا لِيَ لَا أَرَى الْهُدْهُدَ أَمْ كَانَ
مِنَ الْغَائِبِينَ ﴿٢٠﴾

**20** అతను పక్షులను తనిఖీ చేసి, “హుద్ హుద్ పక్షి (వడ్రంగి పిట్ట!) నాకు కనిపించటంలేదేమిటి? అది నిజంగానే హాజరు కాలేదా?”[25] అని అన్నాడు.

ఎంత ఘనత ప్రసాదించబడినప్పటికీ ఆయన అగోచర జ్ఞాని మాత్రం కారు. అందుకే– ‘తెలీకుండా’ సులైమాను సైన్యం నలిపివేస్తుందేమో! నన్న కీడును ఆ చీమ శంకించింది. ఇంకొక విషయం: అల్లాహ్ తప్ప మరొకరెవరికీ అగోచర జ్ఞానం లేదన్న విశ్వాసం జంతువులకు కూడా ఉంది. ముమ్ముందు రాబోయే ‘హుద్ హుద్’ పక్షి సంఘటన ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తుంది. నాల్గు: హజ్రత్ సులైమానుకు పక్షులతో పాటు ఇతర జంతువుల భాష కూడా తెలుసు. జిన్నాతు తదితర ప్రాణులను అల్లాహ్ ఆయనకు లోబరచి ఉంచినట్లే, వివిధ జంతువుల, పక్షుల భాషను కూడా ఆయనకు నేర్పాడు.

23. ‘చీమ’ లాంటి చిన్న జంతువు మాటలను సయితం అర్థం చేసుకునే శక్తి తనలో ఉందని తెలియగానే హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) గారిలో దేవునిపట్ల కృతజ్ఞతా భావం ఉప్పొంగింది. అందుకే ఆయన ఈ సందర్భంగా అల్లాహ్‌ను ప్రార్థిస్తూ, తనను ఎల్లప్పుడూ అదుపు ఆజ్ఞల్లో ఉండేట్లు చూడమని కోరారు.

24. **‘నీ దయతో’** నన్ను నీ సజ్జనులైన దాసులలో చేర్చుకో అన్న అభ్యర్థన గమనించదగినది. స్వర్గం విశ్వాసుల నిలయం. అయితే దేవుని దయలేకుండా ఎవరూ అందులో ప్రవేశించలేరు. అందుకే హదీసులో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)ఈ విధంగా ప్రవచించారు : “తిన్నగా ఉండండి. సత్యానికి సమీపంలో ఉండండి. ఏ వ్యక్తి కూడా కేవలం తన కర్మల ఆధారంగా స్వర్గంలోకి పోలేడన్న విషయాన్ని బాగా తెలుసుకోండి.” ‘ఓ దైవప్రవక్తా (స)! మీరు కూడా అంతేనా?!’ అని ఆయన (స) సహచరులు అడగ్గా, “అవును. అల్లాహ్ నన్ను తన కారుణ్య ఒడిలోకి తీసుకోనంతవరకూ నేను

لَاُعَذِّبَنَّهٗ عَذَابًا شَدِيْدًا اَوْ لَاَاذْبَحَنَّهٗۤ اَوْ لَيَاْتِيَنِّيْ
بِسُلْطٰنٍ مُّبِيْنٍ ﴿٢١﴾

**21** "నేను దానిని కఠినంగా శిక్షిస్తాను లేదా దాన్ని కోసివేస్తాను లేదా అది నాకు సరైన సంజాయిషీ అన్నా ఇవ్వాలి" (అని చెప్పాడు).

فَمَكَثَ غَيْرَ بَعِيْدٍ فَقَالَ اَحَطْتُّ بِمَا لَمْ تُحِطْ بِهٖ
وَجِئْتُكَ مِنْ سَبَاٍۭ بِنَبَاٍ يَّقِيْنٍ ﴿٢٢﴾

**22** కొద్ది సేపట్లోనే అది వచ్చి ఇలా విన్నవించుకోసాగింది : "మీకు తెలియని ఒక సమాచారాన్ని నేను సేకరించాను.[26] నేను 'సబా' (జాతి)కి చెందిన[27] ఒక నిజవార్తను మోసుకు వచ్చాను.

اِنِّيْ وَجَدْتُّ امْرَاَةً تَمْلِكُهُمْ وَاُوْتِيَتْ مِنْ كُلِّ شَيْءٍ
وَّلَهَا عَرْشٌ عَظِيْمٌ ﴿٢٣﴾

**23** "(ఆ జాతి) వారిని ఒక స్త్రీ పరిపాలిస్తుండటం నేను కనుగొన్నాను.[28] ఆమెకు అన్ని వస్తువులలో నుంచి (అంతో ఇంతో) ప్రసాదించబడింది. ఆమె సింహాసనం కూడా వైభవోపేతమైనదే.[29]

కూడా స్వర్గంలోకి వెళ్ళలేను" అని మహాప్రవక్త (స) స్పష్టం చేశారు. (సహీహ్ బుఖారీ – హ.నెం. 6467; ముస్లిం – నెం.217)

25. అంటే అది ఎక్కడికో వెళ్ళిందన్నమాట!

26. అంటే ఆ విషయానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించాను.

27. **'సబా'** అనేది అసలు ఒక వ్యక్తి పేరు. ఈ పేరు మీదే ఒక జాతి ఉండేది. ఒక పట్టణం కూడా ఉండేది. ఇక్కడ దీన్ని పట్టణం అన్న భావంలో తీసుకోవాలి. ఇది సనా (యమన్)కు మూడు రోజుల ప్రయాణానికి దూరాన ఉంది. ఆ ప్రాంతం మారబ్ యమన్‌గా ప్రసిద్ధిచెందింది. (ఫత్‌హుల్ ఖదీర్)

28. ఒక స్త్రీ ఒక జాతిని పరిపాలించటం హుద్ హుద్ పక్షిని సయితం ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఈ కాలంలో స్త్రీలు అన్ని విషయాలలోనూ పురుషులకు సమానంగా పరిగణించబడుతున్నారు. ఒక పురుషుడు రాజ్యాధికారి అయినప్పుడు స్త్రీ ఎందుకు కాకూడదు? అని ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ సిద్ధాంతం ఇస్లామీయ ప్రబోధనలకు విరుద్ధమైనది. కొంతమంది మేధావులు సబా రాణి (బిల్ఖీస్)ని ఉదాహరిస్తూ స్త్రీ రాజ్యాన్ని పరిపాలించటం ధర్మసమ్మతమేనని వాదిస్తున్నారు. మరి చూడబోతే ఖుర్ఆన్ ఒకానొక సంఘటనను ఇక్కడ ప్రస్తావించిందే తప్ప ఆ పరిపాలనను సమర్థించలేదు. వివరాల్లోకి పోతే ఖుర్ఆన్ హదీసులు స్త్రీ పరిపాలనకు సుముఖంగా లేవని తెలుస్తుంది.

**24** "అయితే ఆమె, ఆమె ప్రజలు కూడా అల్లాహ్‌ను వదలి సూర్యునికి ప్రణమిల్లటం నేను గమనించాను. షైతాను వారి కర్మలను వారికి మంచివిగా కనిపించే టట్లు చేసి, వాళ్లను సన్మార్గం పొందకుండా అడ్డుకున్నాడు.[30] అందువల్ల వారు సన్మార్గ భాగ్యం పొందలేకపోతున్నారు."

وَجَدتُّهَا وَقَوْمَهَا يَسْجُدُونَ لِلشَّمْسِ مِن دُونِ اللَّهِ وَزَيَّنَ لَهُمُ الشَّيْطَانُ أَعْمَالَهُمْ فَصَدَّهُمْ عَنِ السَّبِيلِ فَهُمْ لَا يَهْتَدُونَ ﴿٢٤﴾

**25** ఆకాశాలలోనూ, భూమిలోను నిక్షిప్తమై ఉన్న వస్తువులను[31] వెలికితీసేవాడు, మీరు గోప్యంగా ఉంచే, బహిర్గతం చేసే విషయా లన్నీ తెలిసినవాడైన అల్లాహ్‌కు వారు సాష్టాంగపడాల్సింది (కాని వారలా చేయటం లేదు).[32]

أَلَّا يَسْجُدُوا لِلَّهِ الَّذِي يُخْرِجُ الْخَبْءَ فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ وَيَعْلَمُ مَا تُخْفُونَ وَمَا تُعْلِنُونَ ﴿٢٥﴾

**26** అల్లాహ్–ఆయన తప్ప వేరొక ఆరాధ్య దైవం లేదు. ఆయనే మహోన్నతమైన సింహాసనానికి అధిపతి.[33]

اللَّهُ لَا إِلَٰهَ إِلَّا هُوَ رَبُّ الْعَرْشِ الْعَظِيمِ ۩ ﴿٢٦﴾

السجدة ٨

29. ఆ సింహాసనం పొడవు 80 గజాలని, వెడల్పు 40 గజాలని, ఎత్తు 30 గజాలని అనబడుతోంది. ఆ సింహాసనం ముత్యాలతో, పగడాలతో, వజ్రవైఢూర్యాలతో పొదగబడి వుండేది. నిజము దేవుడెరుగు (ఫత్‌హుల్ ఖదీర్). అయితే ఈ కథనంలో అతిశయోక్తి మాత్రం కనిపిస్తోంది. ఎందుకంటే యమన్ దేశంలో శిథిలావస్థలో ఉన్న ఆ స్త్రీ (బిల్ఖీస్) రాజ ప్రాసాదంలో అంత ఎత్తయిన సింహాసనం ఉండే అవకాశం లేదు.

30. ఆ పక్షి వ్యక్తపరచిన మనోభావాల్ని బట్టి రెండు విషయాలు ఇక్కడ విదితమవుతున్నాయి. ఒకటి : మీకు సయితం తెలియని ఒక విషయాన్ని నేడు నేను కనుగొన్నానని ఆ పక్షి చెప్పిందంటే దైవప్రవక్త (అలైహిముస్సలాం)లకు రహస్య విషయాల జ్ఞానం ఉండదు. రెండు: పక్షులకు దేవుని ఏకత్వం (తౌహీద్) గురించిన స్పృహ ఉంటుంది. అందుకే బిల్ఖీస్ జాతివారు, అల్లాహ్‌ను వదలి సూర్యునికి ప్రణమిల్లటం పట్ల ఆ వడ్రంగి పిట్ట ఆశ్చర్య పడింది. పైగా షైతాన్ సూర్యపూజను మంచిపనిగా వారికి చూపిస్తున్నట్లు అభిప్రాయపడింది.

**27** సులైమాను ఇలా అన్నాడు : "సరే, నువ్వు నిజం చెబుతున్నావో లేక అబద్ధం చెబుతున్నావో మేము చూస్తాము.

قَالَ سَنَنْظُرُ أَصَدَقْتَ أَمْ كُنْتَ مِنَ الْكٰذِبِيْنَ ﴿٢٧﴾

**28** "నా ఈ ఉత్తరాన్ని తీసుకుపోయి వారివద్ద పడవెయ్యి. వారి దగ్గరి నుంచి తొలగిపోయి, వారేవిధంగా స్పందిస్తారో చూడు."[34]

اِذْهَبْ بِّكِتٰبِيْ هٰذَا فَاَلْقِهْ اِلَيْهِمْ ثُمَّ تَوَلَّ عَنْهُمْ فَانْظُرْ مَاذَا يَرْجِعُوْنَ ﴿٢٨﴾

**29** ఆమె (రాణి) ఇలా చెప్పింది : "సభాసదులారా! నా వద్ద గౌరవప్రదమైన ఒక ఉత్తరం వెయ్యబడింది.

قَالَتْ يٰۤاَيُّهَا الْمَلَؤُا اِنِّيْۤ اُلْقِيَ اِلَيَّ كِتٰبٌ كَرِيْمٌ ﴿٢٩﴾

31. మరి నిజానికి ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించి మొక్కల్ని మొలకెత్తించేవాడు, ఖనిజ సంపదలను, చమురు నిల్వలను మానవజాతి కోసం సమకూర్చేవాడు అల్లాహ్‌యే. **'ఖబ్‌ఉన్'** అంటే నిక్షిప్తమై ఉన్నది అని అర్థం.

32. అల్లాహ్‌కు సాష్టాంగపడకుండా ఉండటాన్ని కూడా షైతాన్ వారికి సముచితమైన పనిగా చేసి చూపించాడు. సాష్టాంగప్రణామం కేవలం అల్లాహ్‌కు మాత్రమే శోభిస్తుంది అన్న సంగతి వారికి అర్థం కాలేదు. (ఫత్‌హుల్ ఖదీర్)

33. వాస్తవానికి అల్లాహ్ సృష్టిలోని ప్రతి వస్తువుకూ అధిపతి. కాని పై ఆయతులో మహోన్నతమైన సింహాసనానికి అధిపతి అని మాత్రమే చెప్పటంలోని ఔచిత్యం ఏమిటంటే ఆయన సింహాసనం విశ్వంలోని వస్తువులన్నిటికంటే పెద్దది. దాని గురించి చెబితే ఇక సృష్టిలోని ఇతర వస్తువులన్నిటి గురించి చెప్పినట్లుగానే భావింపబడుతుంది. మరో కారణం ఏమిటంటే సబారాణి సింహాసనం ఎంతో గొప్పదైనప్పటికీ విశ్వప్రభువు సింహాసనం ముందు దానికి పూచిక పుల్లంత కూడా విలువ లేదు. అది తెలియ జేయటమే పై వాక్యం ఉద్దేశం. హుద్ హుద్ పక్షి ఒక వైపు బిల్ఖీస్ వైభవాన్ని చాటి చెబుతూనే ఆమె తన జనులతో సహా సూర్యుణ్ణి పూజించటంపట్ల ఆశ్చర్యాన్ని ప్రకటించింది. దేవుని ఏకత్వాన్ని, ఆయన ఉపకారాలను స్మరించింది. అందుకే హదీసులో ఇలా చెప్పబడింది : "నాలుగు జంతువులను చంపకండి– చీమను, తేనెటీగను, హుద్ హుద్ (వడ్రంగి పిట్ట)ను, సుర్దను." (ముస్నదె అహ్మద్–1/332; అబూ దావూద్–కితాబుల్ అదబ్). సుర్ద అనే జంతువు తలపెద్దగా, పొట్ట తెల్లగా, వీపు పచ్చగా ఉంటుంది. అది చిన్న చిన్న పక్షులను వేటాడి తింటుంది. (ఇబ్నె కసీర్ వివరణలు).

34. అంటే–నువ్వు ఆ ఉత్తరాన్ని ఆమె ఉండే ఏకాంత ప్రదేశంలో పడవేసి, వెంటనే ఆమెకు దూరంగా జరుగు. ఆ తరువాత ఏం జరుగుతుందో, జాగ్రత్తగా గమనించు.

**30** “ఇది సులైమాను దగ్గరి నుంచి వచ్చింది. – ఇది అపార కరుణా మయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం” (అయింది అంటూ చదువ సాగింది).

إِنَّهُۥ مِن سُلَيْمَٰنَ وَإِنَّهُۥ بِسْمِ ٱللَّهِ ٱلرَّحْمَٰنِ ٱلرَّحِيمِ ﴿٣٠﴾

**31** “మీరు నాకు వ్యతిరేకంగా ఏమాత్రం తలబిరుసుతనం చూపకుండా, విధేయులై (ముస్లింలై) నా దగ్గరకు వచ్చేయండి (అని ఇందులో లిఖించబడివుంది).”[35]

أَلَّا تَعْلُوا۟ عَلَىَّ وَأْتُونِى مُسْلِمِينَ ﴿٣١﴾

**32** “ఓ ప్రముఖులారా! ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి. ఏ విషయాన్నయినా మీ దృష్టికి తేకుండా, (మిమ్మల్ని సంప్రతించకుండా) నేను ఏ నిర్ణయమూ తీసుకోను కదా!” అని రాణి చెప్పింది.

قَالَتْ يَٰٓأَيُّهَا ٱلْمَلَؤُا۟ أَفْتُونِى فِىٓ أَمْرِى مَا كُنتُ قَاطِعَةً أَمْرًا حَتَّىٰ تَشْهَدُونِ ﴿٣٢﴾

**33** దానికి వారంతా, “(అమ్మా!) మనం బలవంతులం. గొప్ప పోరాటపటిమ గల వారం.[36] ఇకమీదట ఏం చేయాలన్నది మీపైనే ఆధారపడి ఉంది. మాకే ఆదేశం ఇవ్వాలో స్వయంగా మీరే ఆలోచించు కోండి”[37] అన్నారు.

قَالُوا۟ نَحْنُ أُو۟لُوا۟ قُوَّةٍ وَأُو۟لُوا۟ بَأْسٍ شَدِيدٍ وَٱلْأَمْرُ إِلَيْكِ فَٱنظُرِى مَاذَا تَأْمُرِينَ ﴿٣٣﴾

35. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) కూడా ఇలాగే చక్రవర్తులకు ఉత్తరాలు వ్రాసేవారు. ఆ ఉత్తరాల్లో ఇస్లాం ధర్మపరిచయం చేసేవారు. అలాగే పూర్వం దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) కూడా తన ఉత్తరం ద్వారా సబా రాణి గార్కి ఇస్లాం సందేశం అందజేశారు. నేటి ఉత్తరాల్లో ఉత్తరం రాసేవారి పేరు లేఖ చివర్లో ఉంటోంది. కాని మన పూర్వీకుల (సలఫ్‌ల) విధానం మాత్రం పై వాక్యాల్లో వివరించ బడిన సులైమాన్ ప్రవక్త విధానాన్ని అనుసరించి ఉండేది. అంటే ఉత్తరం రాసేవారి పేరు ముందుగా ప్రస్తావించబడుతుందన్నమాట!

36. అంటే, మన దగ్గర సైనిక బలమూ ఉంది. ఆయుధాలు కూడా ఉన్నాయి. యుద్ధ సమయాల్లో వెన్నుచూపకుండా కడదాకా పోరాడే యోధులూ ఉన్నారు. కాబట్టి మనం ఒకరికి లొంగవలసిన అవసరం లేదు.

**34** ఆమె (రాణి)గారు ఇలా అభిప్రాయ
పడ్డారు : "సాధారణంగా రాజులు ఏ
నగరంలో జొరబడినా[38] దాన్ని ధ్వంసం
చేస్తారు. అక్కడి మర్యాదస్తులను అవ
మానాలపాలు చేస్తారు.[39] (బహుశా) వీళ్లూ
అదే చేయవచ్చు.[40]

قَالَتْ إِنَّ الْمُلُوكَ إِذَا دَخَلُوا قَرْيَةً أَفْسَدُوهَا وَجَعَلُوا
أَعِزَّةَ أَهْلِهَا أَذِلَّةً ۚ وَكَذَٰلِكَ يَفْعَلُونَ ﴿۳۴﴾

**35** "నేను వాళ్ళకు ఒక కానుక పంపి
స్తాను. ఆ తరువాత దౌత్యకారులు ఏం
జవాబు తీసుకువస్తారో చూస్తాను."[41]

وَإِنِّي مُرْسِلَةٌ إِلَيْهِم بِهَدِيَّةٍ فَنَاظِرَةٌ بِمَ يَرْجِعُ الْمُرْسَلُونَ ﴿۳۵﴾

**36** (రాణిగారి) దూత సులైమాను వద్దకు
చేరుకున్నప్పుడు, "ఏమిటీ, మీరు నాకు
ధనరూపేణా సహాయం చేయాలనుకుంటు
న్నారా?[42] నా ప్రభువు నాకు, మీకిచ్చిన

فَلَمَّا جَاءَ سُلَيْمَانَ قَالَ أَتُمِدُّونَنِ بِمَالٍ فَمَا آتَانِيَ اللَّهُ
خَيْرٌ مِّمَّا آتَاكُم بَلْ أَنتُم بِهَدِيَّتِكُمْ تَفْرَحُونَ ﴿۳۶﴾

37. (అమ్మా!) మేము సలహాలను ఇచ్చేవారం మాత్రమే. తుది నిర్ణయం మీదే. మీరు ఏ ఆజ్ఞను జారీ చేసినా మేము దాన్ని శిరసావహిస్తాము.

38. అంటే, వారు తమ సైనిక శక్తితో జైత్రయాత్రను సాగించినపుడు, ప్రతిఘటన ఎదురైన చోటల్లా విధ్వంసం తప్పదు.

39. వారు యుద్ధ సమయంలో రక్తపాతం సృష్టిస్తారు. ఆస్తులను దోచుకుంటారు. గౌరవ నీయులను బందీలుగా పట్టుకుంటారు. వారి స్థాయికి తగని విధంగా వారిపట్ల ప్రవర్తిస్తారు.

40. కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఈ పలుకులు అల్లాహ్‌వి. ఆయన సబా రాణికి అనుకూలంగా ఈ మాటల్ని పలికాడు. మరి కొంతమంది ప్రకారం ఇవి సబారాణి బిల్ఖీస్ పలుకులే. సందర్భం దృష్ట్యా చూస్తే రెండవ అభిప్రాయమే సరైనదనిపిస్తుంది.

41. సులైమాన్ ప్రాపంచిక కీర్తి ప్రతిష్ఠల్ని ఆశించే రాజో లేక దేవుని తరఫున నియుక్తమైన ప్రవక్తో ఇప్పుడు తెలిసిపోతుంది. అతను గనక నా కానుకను స్వీకరించకపోతే, అతను ధర్మసంస్థాపన కోసం ప్రయత్నించే ప్రవక్త అని అనుకుంటాను. అట్టి పరిస్థితిలో మనమంతా ఆయనకు విధేయత చూపక తప్పదు.

42. అల్లాహ్ నాకు ప్రసాదించిన భాగ్యాలను మీరు చూడటం లేదా? మీ రాణి గారు పంపిన పారితోషికం వల్ల నాకు ఒరిగేదేమీ లేదు. ఈ పారితోషికాన్ని మీరు మీ దగ్గరే ఉంచుకోండి అంటూ సులైమాన్ బిల్ఖీస్ కానుకను గ్రహించటానికి నిరాకరించారు.

దానికన్నా మేలైనది ప్రసాదించాడు. కాబట్టి మీ కానుకతో మీరే సంతోష పడండి" అని సులైమాను అన్నాడు.[43]

**37** "నువ్వు వారి వద్దకే తిరిగి వెళ్ళు.[44] మేము వారిపైకి వారు నిలువరించలేని సైన్యాలను తీసుకువస్తాము. వారిని పరాభవం పాల్జేసి అక్కణ్ణుంచి వెళ్ళగొడ తాము. తుదకు వారు కడు నిస్సహాయులుగా ఉండిపోతారు"[45] (అని చెప్పాడు).

ارْجِعْ إِلَيْهِمْ فَلَنَأْتِيَنَّهُم بِجُنُودٍ لَّا قِبَلَ لَهُم بِهَا وَلَنُخْرِجَنَّهُم
مِّنْهَا أَذِلَّةً وَهُمْ صَاغِرُونَ ﴿٣٧﴾

**38** "ఓ ప్రముఖులారా! వారు విధేయులై ఇక్కడకు చేరుకొనకముందే, ఆమె సింహాసనాన్ని నా దగ్గరకు తేగలవారు మీలో ఎవరయినా ఉన్నారా?"[46] అని అతను అడిగాడు.

قَالَ يَا أَيُّهَا الْمَلَأُ أَيُّكُمْ يَأْتِينِي بِعَرْشِهَا قَبْلَ أَن يَأْتُونِي
مُسْلِمِينَ ﴿٣٨﴾

43. మీ కానుకను మీరే అనుభవించండి. ప్రాపంచిక ప్రయోజనాలను, పారితోషికాలను పొందటం నా లక్ష్యం కానేకాదు. అలా అనుకుంటే ప్రపంచంలో వేరెవరికీ ఇవ్వని భోగభాగ్యాలను నా ప్రభువు నాకిచ్చాడు. వీటన్నింటితో పాటు నన్ను దైవప్రవక్తగా కూడా నియమించాడు.

44. ఇంతకుముందు హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) రాయబారిని బహువచనంలో సంబోధించారు. ఇప్పుడేమో ఏకవచనంలో సంబోధిస్తున్నారు. ఎందుకంటే ప్రసంగంలో ఒక్కోసారి మొత్తం జాతినుద్దేశించి విషయం చెప్పాల్సి ఉంటుంది. ఇక్కడ మాత్రం సూటిగా రాయబారి ఒక్కణ్ణే ఉద్దేశించి మాట్లాడారు.

45. హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) కేవలం రాజు కారు, ఆయన ఒక ప్రవక్త కూడా. అందువల్ల ఆయన తరఫున ప్రజలు పరాభవంపాలు కావటం అన్నది జరగని పని. కాని సాధారణంగా యుద్ధంవల్ల రక్తపాతం జరుగుతుంది. ధనప్రాణ నష్టం జరుగుతుంది. ఓడినవారు అశక్తులవుతారు – ఇదే ఆయన మాటల్లోని ఆంతర్యం. అంతకుమించి దైవప్రవక్తలు ఏ జాతి ప్రజలను కూడా కించపరచే విధంగా ప్రవర్తించరు. అంతిమ దైవప్రవక్త (సఅసం) వారు యుద్ధ సమయాలలో అవలంబించే విధానం ఈ సందర్భంగా స్మరించుకోదగినది.

46. అంతకుముందు సులైమాన్ (అలైహిస్సలాం) ఇచ్చిన జవాబును బట్టి, తాను ఆయన్ని

**39** జిన్నులలో బలిష్టుడైన ఒకతను, "మీరు మీ స్థానం నుంచి లేచే లోపలే[47] నేను దానిని మీ ముందు సమర్పిస్తాను.[48] అంతటి శక్తి నాకుంది. నేను విశ్వస నీయుణ్ణి కూడాను"[49] అని చెప్పాడు.

قَالَ عِفْرِيتٌ مِّنَ الْجِنِّ أَنَا آتِيكَ بِهِ قَبْلَ أَن تَقُومَ مِن
مَّقَامِكَ ۖ وَإِنِّي عَلَيْهِ لَقَوِيٌّ أَمِينٌ ﴿٣٩﴾

**40** (అప్పుడు వారిలో) గ్రంథజ్ఞానం గల ఒకతను, "మీరు కళ్లుమూసి తెరిచే లోగానే నేను దాన్ని మీ ముందు తెచ్చిపెట్ట గలను"[50] అన్నాడు. తన కళ్ళముందర ఆ సింహాసనం ఉండటం చూసి సులైమాను,

قَالَ الَّذِي عِندَهُ عِلْمٌ مِّنَ الْكِتَابِ أَنَا آتِيكَ بِهِ قَبْلَ
أَن يَرْتَدَّ إِلَيْكَ طَرْفُكَ ۚ فَلَمَّا رَآهُ مُسْتَقِرًّا عِندَهُ قَالَ

ప్రతిఘటించలేనన్న సంగతి ఆమెకు అర్థమైపోయింది. అందువల్ల ఆమె విధేయురాలై సులైమాను వద్దకు వచ్చేందుకు ప్రయాణ సన్నాహాలు మొదలెట్టింది. ఆమె రాబోతుందని సులైమాన్‌కు ముందుగానే తెలిసిపోయింది. తన రాజవైభవాన్ని, శక్తిసామర్థ్యాలను చూపాలన్న ఆలోచన ఆయనకు కలిగింది. వెంటనే ఆయన తన సహాయకులను సమావేశపరచి, బిల్ఖీస్ సింహాసనాన్ని ఆమె రాకకు ముందే తెచ్చిపెట్టే విషయంపై సమాలోచన జరిపారు.

47. హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) వివిధ వ్యాజ్యాలను విని తీర్పు ఇవ్వటానికి ప్రతి రోజూ ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కొలువు తీరేవారు. ఆయన ఆ సభనుంచి లేచి వెళ్ళకముందే ఆ సింహాసనాన్ని ఆయన ముందుంచగలనని ఒక జిన్ను చెప్పాడు.

48. ఆ జిన్ను పలికిన మాటల్ని బట్టి అతను ముమ్మాటికీ జిన్ను జాతికి చెందినవాడై ఉంటాడు. జిన్ను వల్లనే ఇలాంటి సాహసకార్యాలు సాధ్యమవుతాయి. ఒక మానవ మాత్రుడు – అతడెంత శక్తిమంతుడైనా – ఈ పని చేయలేడు. ఎందుకంటే సబా (నేటి యమన్) నుంచి బైతుల్ మఖ్దిస్ (జెరూసలేం) వరకు కొన్ని నిమిషాలలో ఒక రాణి సింహాసనాన్ని తరలించటం అనేది మానవ ప్రయత్నాలకు అతీతమైనది. ఎందుకంటే అక్కణ్ణుంచి ఇక్కడికి రానుపోను మొత్తం మూడువేల మైళ్ల దూరం ఉంది. ఈ సుదీర్ఘ ప్రయాణం మూడు లేక నాలుగు గంటల్లో అయ్యేది కాదు. అదీగాక ఒక సాధారణ మనిషి అంతపెద్ద సింహాసనాన్ని ఎత్తనూ లేడు. ఒకవేళ కొంతమంది సహాయాన్ని తీసుకుని ఎత్తగలిగినా మెరుపువేగంతో తెచ్చి రాజుగారి సమక్షంలో పెట్టలేడు. కాబట్టి తేలిందేమిటంటే ఒక మానవాతీత శక్తి ద్వారా మాత్రమే ఈ పని సాధ్యమవుతుంది.

49. అంటే – నేను ఆ సింహాసనాన్ని తేవటమే కాదు, దాని విలువైన వస్తువులన్నింటినీ

هٰذَا مِنْ فَضْلِ رَبِّيْ ۖ لِيَبْلُوَنِيْٓ ءَاَشْكُرُ اَمْ اَكْفُرُ ۭ وَمَنْ شَكَرَ فَاِنَّمَا يَشْكُرُ لِنَفْسِهٖ ۚ وَمَنْ كَفَرَ فَاِنَّ رَبِّيْ غَنِيٌّ كَرِيْمٌ ﴿٤٠﴾

"ఇది నా ప్రభువు అనుగ్రహం. నేను కృతజ్ఞుణ్ణి అవుతానో లేక (ప్రభువు) చేసిన మేలును మరచిపోతానో పరీక్షించటానికే (ఆయన ఇదంతా చేశాడు). ఎవడైనా కృతజ్ఞతా పూర్వకంగా వ్యవహరిస్తే అతని కృతజ్ఞతాభావం అతనికే ప్రయోజనకరం అవుతుంది. మరెవరయినా మేలును మరచి ప్రవర్తిస్తే నా ప్రభువు లక్ష్యపెట్టనివాడు, గొప్ప ఉదాత్తుడు" అని పలికాడు.

قَالَ نَكِّرُوْا لَهَا عَرْشَهَا نَنْظُرْ اَتَهْتَدِيْٓ اَمْ تَكُوْنُ مِنَ الَّذِيْنَ لَا يَهْتَدُوْنَ ﴿٤١﴾

**41** "ఆ సింహాసనం రూపురేఖలను (స్వల్పంగా) మార్చేయండి.[51] ఆమె తన సింహాసనాన్ని గుర్తించే విషయంలో మార్గం పొందుతుందో లేక మార్గం తప్పిన వారిలో చేరుతుందో చూద్దాం"[52] అని సులైమాను ఆదేశించాడు.

యధాతథంగా ఉంచుతాను. అందులో ఎలాంటి హెచ్చుతగ్గులు చేయటంగానీ, మోసం చేయటంగానీ చేయను అన్నది ఆ జిన్ను మాటల్లోని ఉద్దేశం.

50. ఇంతకీ ఈ మాటలన్న ఆ వ్యక్తి ఎవరు? ఆ గ్రంథం ఏది? అతని దగ్గరున్న ఆ విద్య ఏమిటి? అన్న విషయంలో వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ మూడింటి వాస్తవం దేవుడెరుగు. అయితే దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వాక్యాలనుబట్టి, అతను మనిషే అయి ఉంటాడని తెలుస్తోంది. అతనివద్ద గ్రంథ జ్ఞానం ఉంది. రెప్పపాటు సమయంలో సింహాసనాన్ని ఒక రాజ్యం నుంచి మరో రాజ్యానికి తరలించే శక్తిని దేవుడు – ఒక మహిమ రూపంలో – అతనికి ప్రసాదించి ఉండవచ్చు. బాహ్యంలో ఇది సహజత్వానికి, భౌతికతకు విరుద్ధంగా కనిపిస్తున్నప్పటికీ, దైవప్రణాళిక ననుసరించి అసాధారణమైన రీతిలో ఇలాంటి వింతలు విశేషాలు జరగటం అసంభవం కూడా కాదు. అందుచేత ఇక్కడ ఆ వ్యక్తి శక్తియుక్తులపై ఆశ్చర్యం చెందాల్సిన అవసరంగానీ, అతనికి అబ్బిన ఆ విద్య గురించి కూపీలు లాగాల్సిన ఆవశ్యకతగానీ లేదు. ఒక అసాధారణ విషయాన్ని ఆవిష్కరించటానికి ఇక్కడ ఒక వ్యక్తి పరిచయం చేయబడ్డాడంతే. నిజానికి ఆ ఆవిష్కరణ వెనుక దైవప్రేరణ, దైవప్రణాళిక ఉన్నాయి. ఆయన తాను తలచింది ఉనికిలోకి తెస్తాడు. ఈ వాస్తవం హ(జత్ సులైమాను (అలైహిస్సలాం)కు కూడా తెలుసు. అందుకే ఆయన తన కళ్లముందర ఉన్న ఆ సింహాసనాన్ని చూడగానే, అప్రయత్నంగా, "ఇది నా ప్రభువు అనుగ్రహం" అన్నారు.

**42** ఆమె రాగానే, “నీ సింహాసనం కూడా ఇలాంటిదేనా?!” అని అనబడింది. దాని కామె, “ఇది అచ్చం అలాగే ఉంది.[53] మాకు ముందుగానే (విషయం) తెలిసి వచ్చింది. మేము అప్పుడే విధేయులం (ముస్లింలం) అయ్యాము”[54] అని సమాధానమిచ్చింది.

فَلَمَّا جَاءَتْ قِيلَ أَهٰكَذَا عَرْشُكِ ۖ قَالَتْ كَأَنَّهُ هُوَ ۚ وَأُوتِينَا الْعِلْمَ مِن قَبْلِهَا وَكُنَّا مُسْلِمِينَ ﴿٤٢﴾

**43** అల్లాహ్‌ను వదలి ఆమె ఎవరెవరినయితే పూజించేదో వారు ఆమెను (సన్మార్గం నుంచి) ఆపి ఉంచేవారు. నిశ్చయంగా (లోగడ) ఆమె అవిశ్వాస జనులకు చెందినది.[55]

وَصَدَّهَا مَا كَانَت تَّعْبُدُ مِن دُونِ اللَّهِ ۖ إِنَّهَا كَانَتْ مِن قَوْمٍ كَافِرِينَ ﴿٤٣﴾

51. అంటే – దాని రంగు మార్చండి. రూపురేఖలలో కూడా కొన్ని మార్పులు చేర్పులు చేయండి.

52. అంటే – ఆమె తన సింహాసనాన్ని గుర్తుపడుతుందో లేదో చూద్దాం అన్నది ఒక అర్థం కావచ్చు. ఆమె సన్మార్గానికి వస్తుందో, మార్గవిహీనురాలవుతుందో పరీక్షిద్దాం అన్నది మరో అర్థం కావచ్చు. ఇంతపెద్ద అద్భుతం చూసిన తరువాత కూడా దైవమార్గం బోధపడుతుందో లేదో చూడాలి అని భావించి హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) ఆమెకు ఈ పరీక్ష పెట్టారు.

53. సింహాసనం రూపురేఖలలో కొన్ని మార్పులు చేర్పులు చేయటం మూలంగా ఆమె దాన్ని గుర్తుపట్టడంలో కించిత్ తడబాటుకు లోనయింది. అందుకే ఇది ‘నాదే’ అని అనే బదులు ‘నా సింహాసనం అచ్చం ఇలాగే ఉంటుంది’ అని చెప్పింది. తన వస్తువు రూపురేఖల్లో మార్పులు జరిగినప్పటికీ మనిషి దాన్ని గుర్తుపట్టకపోడు. అందుకే ఆమె ఆ సింహాసనం తనది కాదని కూడా చెప్పలేదు. మొత్తానికి “అది అచ్చం ఇలాగే ఉంటుంది” అని చెప్పి ఎంతో విజ్ఞతను ప్రదర్శించింది. అవుననిగానీ, కాదనిగానీ చెప్పలేదు.

54. అంటే మేము ఇక్కడికి విచ్చేయకముందే, మీరొక సాధారణ రాజు కారనీ, నిశ్చయంగా మీరు దైవప్రవక్త అయి ఉంటారని ఊహించాము. అందుకే మేము ఇస్లాం స్వీకరించాము. మీకు విధేయులమై ఇక్కడికి వచ్చాము అని రాణిగారు చెప్పారు.

అయితే ఇమామ్ ఇబ్నె కసీర్, ఇమామ్ షౌకానీ తదితరులు ఈ వాక్యాన్ని మరో విధంగా తీసుకున్నారు. వారు చెప్పిన భాష్యం ఇది : “ఈ పలుకులు నిజానికి హజ్రత్

قِيْلَ لَهَا ادْخُلِي الصَّرْحَ ۚ فَلَمَّا رَاَتْهُ حَسِبَتْهُ لُجَّةً
وَّكَشَفَتْ عَنْ سَاقَيْهَا ۚ قَالَ اِنَّهٗ صَرْحٌ مُّمَرَّدٌ مِّنْ قَوَارِيْرَ ۗ
قَالَتْ رَبِّ اِنِّيْ ظَلَمْتُ نَفْسِيْ وَ اَسْلَمْتُ مَعَ سُلَيْمٰنَ لِلّٰهِ
رَبِّ الْعٰلَمِيْنَ ﴿٤٤﴾

**44** "మేడలోనికి పదండి" అని ఆమెతో అనబడింది. దాన్ని చూడగానే, ' ఇది నీటి కొలను కాబోలు' అని అనుకుని ఆమె తన పిక్కలపైని వస్త్రాన్ని ఎత్తిపట్టుకుంది.[56] అప్పుడతను, "ఇది గాజుతో చేయబడిన నున్నని నిర్మాణం మాత్రమే" అన్నాడు. "ప్రభూ! నేను (ఇప్పటివరకూ) నా ఆత్మకు అన్యాయం చేసుకున్నాను. ఇప్పుడు నేను సులైమానుతో పాటు సర్వలోక ప్రభువు అయిన అల్లాహ్‌కు విధేయత చూపుతున్నాను"[57] అని ఆమె ప్రకటించింది.

సులైమాన్ గారివి. 'సబా రాణి విధేయురాలై మా దగ్గరకు వస్తుందన్న సంగతి మాకు ముందుగానే తెలుపబడింది' అని హజ్రత్ సులైమాన్ చెప్పారు."

55. ఇవి దేవుని పలుకులు. ఆమెను నిజదైవం వైపుకు రాకుండా అడ్డుకున్నది ఆమె చేసే బహుదైవారాధనే. అప్పటివరకూ ఆమె ఒక అవిశ్వాస జాతికి చెందినది. అందువల్ల 'ఏకదైవారాధన' గురించి ఆమెకు బొత్తిగా తెలీదు.

అయితే అరబీలోని **'వ సద్దహా మా కానతా్బుదు'** అన్న వాక్యాన్ని గురించి వివరిస్తూ కొంతమంది పండితులు ఈ వాక్యానికి అసలు అర్థం 'సులైమాన్ ప్రవక్త ఆమెను బహుదైవారాధన చేయకుండా ఆపారు' అని అభిప్రాయపడగా, 'అల్లాహ్ ఆమెను బహుదైవారాధన చేయకుండా అడ్డుకున్నాడు' అన్న అర్థం పై వాక్యానికి సరిపోతుందని మరికొంతమంది అభిప్రాయపడ్డారు. నిజం చెప్పాలంటే ఈ వాక్యానికి మొదటగా చెప్పబడిన అర్థమే సరైనదని తోస్తోంది. అనగా అంతకుమునుపు ఆమె చేస్తూ ఉండిన బహుదైవారాధనే ఆమెను నిజదైవం వైపు రాకుండా అడ్డుకుంది. (ఫత్‌హుల్ ఖదీర్).

56. ఆ మేడ అద్దాలతో నిర్మించబడింది. దాని ముంగిట కూడా అద్దాలే అమర్చబడ్డాయి. దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) తన దైవదౌత్యపు నిదర్శనాలను చూపిన తరువాత, తన ప్రాపంచిక వైభవాన్ని కూడా ఆమెకు చూపాలనుకున్నారు. దేవుడు ఆయనకు కనీ వినీ ఎరుగని రాజ వైభవాన్ని ప్రసాదించాడు. ఆ అద్దాల మేడలోనికి ప్రవేశించమని ఆమెకు చెప్పగానే, ఆమె అందులోనికి వెళ్ళబోయింది. అక్కడ పరచబడివున్న రాళ్లు కూడా గాజుతో చేయబడినవే. దాన్ని ఆమె అపురూప సరస్సుగా తలపోసి, తన వస్త్రాలు తడిసిపోకుండా ఉండటానికి పిక్కల వరకూ ఎత్తిపట్టుకున్నది.

57. తీరా అడుగుపెట్టిన తరువాత ఆమెకు తెలిసింది – అది కోనేరు కాదనీ, స్వచ్ఛమైన

**45** మేము సమూద్ జాతి వారి వైపు వారి సోదరుడైన సాలెహ్‌ను "మీరంతా అల్లాహ్‌ను ఆరాధించండి" అని సందేశం ఇచ్చి పంపాము. కాని వారు మాత్రం రెండు వర్గాలుగా చీలిపోయి పరస్పరం పోట్లాడుకోసాగారు.[58]

وَلَقَدْ أَرْسَلْنَا إِلَىٰ ثَمُودَ أَخَاهُمْ صَالِحًا أَنِ اعْبُدُوا اللَّهَ فَإِذَا هُمْ فَرِيقَانِ يَخْتَصِمُونَ ﴿٤٥﴾

**46** అతను (సాలెహ్) ఇలా అన్నాడు : "ఓ నా జాతివారలారా! మీరు మంచి పనికి ముందు చెడుకోసం ఎందుకింత ఆత్రం చేస్తున్నారు?[59] మీరు క్షమాపణ కొరకు అల్లాహ్‌ను ఎందుకు వేడుకోరు? తద్వారా మీరు కరుణించబడవచ్చు కదా!"

قَالَ يَا قَوْمِ لِمَ تَسْتَعْجِلُونَ بِالسَّيِّئَةِ قَبْلَ الْحَسَنَةِ ۖ لَوْلَا تَسْتَغْفِرُونَ اللَّهَ لَعَلَّكُمْ تُرْحَمُونَ ﴿٤٦﴾

గాజుపలకలని! ఆమె అంచనాలన్నీ తారుమారైనాయి. తన తప్పును ఒప్పుకుంటూ, తాను ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటించింది.

నున్నగా చేయబడిన రాతి పలకల్ని **'ముమర్రద్'** (مُمَرَّد) అంటారు. 'అమ్‌రద్' అన్న పదం కూడా దీని నుంచి వచ్చినదే. మొహంపై వెంట్రుకలు మొలవని చిన్న పిల్లవాడిని అరబీలో 'అమ్‌రద్' అంటారు. అలాగే ఆకులు రాలిన చెట్టుని 'షజరతున్ మర్‌దా' అని అనటం కద్దు. (ఫత్‌హుల్ ఖదీర్).

**గమనిక :** సబా రాణి (బిల్ఖీస్) ఇస్లాం స్వీకరించిన మీదట ఏం జరిగింది? ఖుర్‌ఆన్ లోగానీ, ప్రామాణిక హదీసులలో గానీ దీని వివరాలు ఎక్కడా లేవు. వారిరువురి (సులైమాన్ – బిల్ఖీస్) వివాహం జరిగిందని కొన్ని వ్యాఖ్యాన కథనాల ఆధారంగా తెలుస్తోంది. అయితే ఈ విషయంపై ఖుర్‌ఆన్ హదీసులు ఏమీ చెప్పకపోవటం వల్ల దానిపై మౌనం వహించటమే ఉత్తమం.

58. అంటే – ఒక వర్గం విశ్వాసులది. ఇంకొకటి అవిశ్వాసులది. ఇరు వర్గాలలో ప్రతిదీ తానే సత్యంపై ఉన్నానని వాదించేది.

59. మీరు సత్యాన్ని విశ్వసించి, సదాచరణ చేసేబదులు, అసత్యాన్నే పట్టుకు వ్రేలాడు తున్నారెందుకు? అసత్యం ఎన్నటికైనా శిక్షకే హేతువుగా పరిణమిస్తుంది. అసత్యాన్ని అంటిపెట్టుకుని ఉండటమంటే దేవుని శిక్ష కోసం ఎదురుచూడటమే. అదీగాక సమూద్ జాతికి చెందిన సత్యతిరస్కారులు దేవుని శిక్ష గురించి చెబితే గేలిచేసేవారు. ఆ శిక్ష ఏదో ఇప్పుడే ఎందుకు తీసుకురావు? అని తమ ప్రవక్తను తొందర పెట్టేవారు. వారి ఈ హడావిడికి సమాధానంగా దైవప్రవక్త హజ్రత్ సాలెహ్ (అ) పలికిన మాటలివి.

قَالُوا اطَّيَّرْنَا بِكَ وَبِمَن مَّعَكَ قَالَ طَائِرُكُمْ عِندَ اللَّهِ
بَلْ أَنتُمْ قَوْمٌ تُفْتَنُونَ ﴿٤٧﴾

**47** దానికి వారు, "నీ మూలంగా, నీ వెంటవున్న వారి మూలంగానే మాకు ఈ దరిద్రం పట్టుకుందని మేము భావిస్తు న్నాము"[60] అన్నారు. "మీ దరిద్రం ఏదో అల్లాహ్ వద్దనే ఉంది.[61] నిజానికి మీరు పరీక్షించబడుతున్నారు"[62] అని సాలెహ్ చెప్పాడు.

وَكَانَ فِي الْمَدِينَةِ تِسْعَةُ رَهْطٍ يُفْسِدُونَ فِي الْأَرْضِ
وَلَا يُصْلِحُونَ ﴿٤٨﴾

**48** ఆ నగరంలో తొమ్మిది మందితో కూడిన (దుష్ట) మూక ఒకటి ఉండేది. వారు భువిలో అరాచకాన్ని సృష్టించేవారు. సంస్క రణ కోసం ఏమాత్రం ప్రయత్నించేవారు కారు.

قَالُوا تَقَاسَمُوا بِاللَّهِ لَنُبَيِّتَنَّهُ وَأَهْلَهُ ثُمَّ لَنَقُولَنَّ لِوَلِيِّهِ
مَا شَهِدْنَا مَهْلِكَ أَهْلِهِ وَإِنَّا لَصَادِقُونَ ﴿٤٩﴾

**49** వారిలా కూడబలుక్కున్నారు : "రాత్రికి రాత్రే సాలెహ్‌పై, అతని ఇంటివారిపై దాడి జరుపుదాం.[63] అతని ఇంటివారు హతమార్చబడినప్పుడు మేమక్కడ లేమని, మేము చెప్పేది సత్యమని అతని వారసు లతో చెబుదాము.[64] ఈ మేరకు అల్లాహ్‌పై ప్రమాణం చేసి మరీ శపథం చేయండి."

60. **'అత్తయ్యర్‌నా'** ( اطَّيَّرْنَا ) అని ఆయతులో ఉంది. ఇది 'తైర్' నుంచి వచ్చింది. తైర్ అంటే ఎగరటం అని అర్థం. పూర్వం అరేబియాలో ఏదైనా పని చేయాలనుకున్నప్పుడు, ఎక్కడికైనా ప్రయాణం చేయాలనుకున్నప్పుడు శకునాలు చూసేవారు. దానికోసం వారు పక్షులను ఎగురవేసేవారు. పక్షి కుడివైపుకు ఎగిరిపోతే మంచి శకునంగా భావించి తమ పని మొదలెట్టేవారు. ఒకవేళ పక్షి ఎడమ వైపుకు ఎగిరిపోతే దుశ్శకునంగా తలపోసి, తాము తలపెట్టిన కార్యాన్ని వాయిదా వేసేవారు (ఫత్‌హుల్ ఖదీర్). ఇస్లాంలో మాత్రం ఇలాంటి మంచి శకునాలకు, చెడ్డ శకునాలకు ఏమాత్రం తావులేదు. ఈ విధంగా శకునాలు (ముహూర్తాలు) చూడటం అధర్మం. అయితే ఏదేని విషయంలో మంచి జరుగుతుందని లేక జరగాలని ఆశించటంలో మాత్రం తప్పులేదు.

61. సాలెహ్ తన జాతి వారినుద్దేశ్యించి ఇలా అన్నారు : మీరు అనుకుంటున్నట్లుగా విశ్వాసులు దరిద్రులు కారు. ఇదంతా మీ భ్రమ. వాస్తవానికి అదృష్ట దురదృష్టాలన్నీ దైవాధీనమై ఉన్నాయి. మీకు ఏ దరిద్రం (కరువు కాటకాల రూపంలో) చుట్టుకుందని అనుకుంటున్నారో అది యదార్థానికి ఒక పరీక్ష. మీ తిరస్కారవైఖరి మూలంగానే దేవుడు మిమ్మల్ని పరీక్షకు లోను చేశాడు (ఫత్‌హుల్ ఖదీర్).

**50** ఈ విధంగా వారు (రహస్యంగా) కుట్ర పన్నారు.[65] మరి మేము కూడా మా వ్యూహాన్ని రచించాము.[66] కాని దాని గురించి వారికి తెలీదు.[67]

وَمَكَرُوا مَكْرًا وَمَكَرْنَا مَكْرًا وَهُمْ لَا يَشْعُرُونَ ۝٥٠

**51** మరి వారి కుట్ర ఎలా పరిణమించిందో చూడండి! మేము వారినీ, వారి జాతి జనులందరినీ మట్టుపెట్టాము.[68]

فَانْظُرْ كَيْفَ كَانَ عَاقِبَةُ مَكْرِهِمْ أَنَّا دَمَّرْنَاهُمْ
وَقَوْمَهُمْ أَجْمَعِينَ ۝٥١

**52** అవిగో, అవే వారి ఇండ్లు! వారి దౌర్జన్యం మూలంగా పాడుబడి ఉన్నాయి. జ్ఞానమున్న వారి కోసం ఇందులో గొప్ప సూచన ఉంది.

فَتِلْكَ بُيُوتُهُمْ خَاوِيَةً بِمَا ظَلَمُوا إِنَّ فِي ذَٰلِكَ لَآيَةً
لِقَوْمٍ يَعْلَمُونَ ۝٥٢

**53** అయితే విశ్వసించి, భయభక్తులతో మెలిగే వారిని మేము కాపాడాము.

وَأَنْجَيْنَا الَّذِينَ آمَنُوا وَكَانُوا يَتَّقُونَ ۝٥٣

62. లేదా మీరు అపమార్గాన పయనిస్తున్నప్పటికీ మీకు కొంత విడుపును ఇచ్చి దేవుడు మిమ్మల్ని పరీక్షిస్తున్నాడు.
63. సమూద్ జాతివారు ముందు ఒంటెను చంపేశారు. అందువల్ల మూడు రోజుల అనంతరం మీపై దైవశిక్ష విరుచుకుపడుతుందని హ్రజత్ సాలెహ్ (అలైహిస్సలాం) ఆ దుర్మార్గులను హెచ్చరించారు. ఆ శిక్ష ఏదో రాకముందే సాలెహ్‌ను, అతని సహచరులను లేపేద్దామని ఆ జాతికి చెందిన తొమ్మిదిమంది ముఠా నాయకులు పథకం వేశారు.
64. అంటే, ఈ ఊచకోతకు పాల్పడింది ఎవరో మాకు తెలీదు, ఆ సమయంలో మేము అక్కడ లేమని చెప్పి తప్పించుకుందాం అని ప్లాను వేశారు.
65. రాత్రిపూట, రహస్యంగా దాడి జరిపి దైవప్రవక్తను, ప్రవక్త అనుచరులను చంపితే పీడ విరగడవుతుందని వారు అనుకున్నారు.
66. వారొకటి తలిస్తే అల్లాహ్ ఇంకొకటి తలచాడు. వారు తమ పథకాన్ని అమలు పరచకముందే అల్లాహ్ వారిని తుదముట్టించాడు. అల్లాహ్ తన ఎత్తుగడల్లో శీఘ్రగామి.
67. అల్లాహ్ ఎత్తుగడలను, అందలి పరమార్థాలను గ్రహించే శక్తి వారికి లేనేలేదు.
68. మేము ఆ తొమ్మిది మంది దుష్ట నాయకులనే గాకుండా, ఆ జాతినంతటినీ తుదముట్టించాము. ఎందుకంటే గుప్పెడు మంది తప్ప మిగిలిన వారంతా తమ అవిశ్వాసంపై మొండికేసినవారే. తమ తొమ్మిది మంది ముఠా నాయకులు పన్నిన కుట్రకు వారంతా వత్తాసు పలికారు. అందువల్ల వారంతా దైవాగ్రహానికి పాత్రులుగా ఖరారయ్యారు.

**54** ఇంకా లూతు (ను పంపినప్పటి సంగతిని జ్ఞాపకం తెచ్చుకో)[69] – అతను తన జాతివారితో, "మీరు అంతా తెలిసి కూడా సిగ్గుమాలిన పని చేస్తున్నారే?![70] అని చెప్పాడు.

وَلُوطًا إِذْ قَالَ لِقَوْمِهِۦٓ أَتَأْتُونَ ٱلْفَٰحِشَةَ
وَأَنتُمْ تُبْصِرُونَ ﴿٥٤﴾

**55** "మీరు ఆడవారిని వదిలేసి, మగవారి వద్దకు కామవాంఛతో ఎగబడి వస్తారేమిటి?[71] నిజానికి మీరు వట్టి మూర్ఖులుగా ప్రవర్తిస్తున్నారు"[72] (అని చెప్పాడు).

أَئِنَّكُمْ لَتَأْتُونَ ٱلرِّجَالَ شَهْوَةً مِّن دُونِ ٱلنِّسَآءِ ۚ بَلْ
أَنتُمْ قَوْمٌ تَجْهَلُونَ ﴿٥٥﴾

**56** "లూతు పరివారాన్ని మీ నగరం నుంచి వెళ్ళగొట్టండి. వారు మహా పవిత్రులుగా చెలామణీ కాగోరుతున్నారు" అనటం తప్ప అతని జాతి వద్ద మరో సమాధానం లేకపోయింది.[73]

فَمَا كَانَ جَوَابَ قَوْمِهِۦٓ إِلَّآ أَن قَالُوٓا۟ أَخْرِجُوٓا۟ ءَالَ
لُوطٍ مِّن قَرْيَتِكُمْ ۖ إِنَّهُمْ أُنَاسٌ يَتَطَهَّرُونَ ﴿٥٦﴾

**57** అందుచేత మేము అతని భార్య మినహా అతన్నీ, అతని పరివారాన్నీ కాపాడాము. ఆమె వెనుక ఉండిపోయేవారిలో చేరుతుందని మేము ముందే నిర్ధారించాము.[74]

فَأَنجَيْنَٰهُ وَأَهْلَهُۥٓ إِلَّا ٱمْرَأَتَهُۥ قَدَّرْنَٰهَا مِنَ ٱلْغَٰبِرِينَ ﴿٥٧﴾

69. లూత్ జాతి ప్రజలు అమూరియా, సదూమ్ పట్టణాలలో నివసించేవారు.

70. అంటే అది మనోనేత్రంతో ముడిపడి ఉన్న విషయం. తాము చేసే పని మంచిది కాదన్న సంగతి వారికి తెలుసు. వారి మనస్సాక్షి సయితం ఆ పనికి ఒప్పుకోదు. ఒకవేళ **'తుబ్‌సిరూన్'** ( تُبْصِرُونَ ) అన్న పదానికి "చూస్తూ చూస్తూనే ఈ పాడు పని చేస్తున్నారేమిటి?" అన్న అర్థం తీసుకుంటే, మీరు మరీ సిగ్గూ ఎగ్గూ లేకుండా, పశువుల్లా ప్రవర్తిస్తున్నారు. మీ పాడు రోగం ఎంతగా ముదిరిపోయిందంటే, జనులు చూస్తున్నారన్న భయం, లజ్జ కూడా మీకు లేకుండా పోయింది అని భావం.

71. అసహజమైన ఈ లైంగిక క్రీడ అసలు లూతు జాతి ప్రజలతోనే మొదలైంది. అందుచేత ఈ స్వలింగ సంపర్క రుగ్మతను **'లవాతత్'**గా వ్యవహరిస్తారు.

72. అంటే–మీరు పాల్పడుతున్న ఈ ముదనష్టపు పని ఎలాంటి విపత్కర పరిణామాలకు దారితీస్తుందో మీకు తెలియదల్లేవుంది. తెలిస్తే మీరు ఈ నీతిబాహ్యమైన చేష్ట జోలికి పోరు.

73. లూతు జాతి వారు ఇచ్చిన ఈ సమాధానంలో వ్యంగ్య ధోరణి ఉంది. మంచిని ప్రబోధించే ప్రవక్తను వారు పరిహసించారు.

58 వారిపై ఒక (ప్రత్యేకమైన రాళ్ల) వాన కురిపించాము.[75] హెచ్చరించబడిన ఆ జనులపై చాలా చెడ్డ వాన కురిసింది.[76]

وَ اَمۡطَرۡنَا عَلَیۡہِمۡ مَّطَرًا ۚ فَسَآءَ مَطَرُ الۡمُنۡذَرِیۡنَ ﴿۵۸﴾

59 (ఓ ప్రవక్తా!) ఇలా చెప్పు : "ప్రశంసలన్నీ అల్లాహ్‌కే శోభిస్తాయి. ఆయన ఎన్నుకున్న దాసులపై శాంతి కురియుగాక![77] ఏమిటీ, అల్లాహ్ మేలా? లేక వారు భాగస్వాములుగా కల్పించుకున్న బూటకపు దేముళ్ళు మేలా?"[78]

قُلِ الۡحَمۡدُ لِلّٰہِ وَ سَلٰمٌ عَلٰی عِبَادِہِ الَّذِیۡنَ اصۡطَفٰی ؕ آٰللّٰہُ خَیۡرٌ اَمَّا یُشۡرِکُوۡنَ ﴿۵۹﴾

60 కాస్త చెప్పండి, ఆకాశాలనూ, భూమిని సృష్టించిన వారెవరు? ఆకాశం నుంచి మీ కొరకు వర్షాన్ని కురిపించిందెవరు? మరి దాని ద్వారా అందాలు జాలువారే తోటలను ఉత్పత్తి చేసింది ఎవరు? ఆ తోటల

اَمَّنۡ خَلَقَ السَّمٰوٰتِ وَ الۡاَرۡضَ وَ اَنۡزَلَ لَکُمۡ مِّنَ السَّمَآءِ مَآءً ۚ فَاَنۡۢبَتۡنَا بِہٖ حَدَآئِقَ ذَاتَ بَہۡجَۃٍ ۚ مَا کَانَ

74. లూతు భార్య సాగిస్తున్న వెన్నుపోటు కార్యకలాపాల గురించి అల్లాహ్‌కు ముందునుంచే తెలుసు. ఆమె పశ్చాత్తాపం చెంది దారికి వచ్చే అవకాశాలు లేకపోవటంతో దేవుడు ఆమెను కూడా దుష్టుల జాబితాలో చేర్చాడు.

75. లూత్ జాతి వారిపై కురిపించబడిన రాళ్ల వర్షం గురించి ఇంతకుముందు వివరంగా వచ్చింది. ఒకవైపు నుంచి వారి బస్తీలు తలక్రిందులుగా చేయబడ్డాయి. మరోవైపు నుంచి వారిపై రాళ్ల వర్షం కురిసింది.

76. అంటే – దేవుడు వారిని అకారణంగా శిక్షించలేదు. వారివద్దకు తన సందేశహరులను పంపించాడు. వారి ద్వారా తన ధర్మాన్ని ప్రబోధించాడు. వారిలో ప్రబలివున్న నైతిక రుగ్మతను దూరం చేసేందుకు దైవప్రవక్త శాయశక్తులా కృషిచేశాడు. కాని అసహజమైన లైంగిక వ్యసనానికి బానిస అయిపోయిన ఆ జాతి వారు ఎంత చెప్పినా దారికి రాకపోవటంతో దేవుడు తన శిక్షా కొరడాను ఝుళిపించాడు.

77. దేవుడు **'ఎన్నుకున్న దాసులు'** అంటే దైవప్రవక్తలని భావం. వారి ద్వారా ప్రజలు సన్మార్గం పొందారు. వారు ఏకదైవారాధన వైపుకు ప్రజలను పిలిచారు. ప్రజల జీవితాలను తీర్చిదిద్దారు. దేవుని ఆ ప్రియతమ దాసులపై శాంతి కురియుగాక!

78. నిస్సందేహంగా అల్లాహ్‌యే (దాస్యమే) మేలు. ఉపాధిప్రదాత, సృష్టికర్త ఆయన మాత్రమే. మరి అటువంటప్పుడు ఆరాధనకు ఆయన కాకుండా వేరొకరు అర్హులెలా అవుతారు? అల్లాహ్ తప్ప వేరితర ఆరాధ్య దైవాలెవరూ తమ దాసుల అక్కరలు తీర్చలేరు.

لَكُمْ أَنْ تُنْبِتُوا شَجَرَهَا ۗ أَإِلَٰهٌ مَعَ اللَّهِ ۚ بَلْ هُمْ قَوْمٌ يَعْدِلُونَ ۝٦٠

చెట్లను మొలకెత్తించటం అనేది మీ వల్ల కాని పని.[79] మరి అల్లాహ్‌తోపాటు మరో ఆరాధ్య దేవుడు కూడా ఉన్నాడా?[80] (లేనే లేదు) కాని ఈ జనులు సమతౌల్యం నుంచి తొలగిపోతున్నారు.[81]

أَمَّنْ جَعَلَ الْأَرْضَ قَرَارًا وَجَعَلَ خِلَالَهَا أَنْهَارًا وَجَعَلَ لَهَا رَوَاسِيَ وَجَعَلَ بَيْنَ الْبَحْرَيْنِ حَاجِزًا ۗ أَإِلَٰهٌ مَعَ اللَّهِ ۚ بَلْ أَكْثَرُهُمْ لَا يَعْلَمُونَ ۝٦١

**61** భూమిని నివాసయోగ్యంగా చేసినదెవరు?[82] దాని మధ్య నదీనదాలను ప్రవహింపజేసింది, దాని నిలకడ కోసం పర్వతాలను పాతిపెట్టింది ఎవరు? రెండు సముద్రాల మధ్య అడ్డుతెరను ఏర్పరచినదెవరు?[83] (ఈ ఏర్పాట్లలో) అల్లాహ్‌తో పాటు ఇంకొక ఆరాధ్య దేవుడు కూడా (సహాయకుడుగా) ఉన్నాడా? (ముమ్మాటికీ లేదు). అయితే వారిలో అనేకులకు అసలేమీ తెలీదు.

79. 59వ ఆయతులో వేయబడిన ప్రశ్నకు వివరణగా ఈ ఆయతులో మరిన్ని విషయాలు లేవనెత్తబడ్డాయి. సృష్టి ప్రక్రియలోనూ, ఆహారాన్ని వొసగటంలోనూ, ప్రణాళికా రచనలోనూ అల్లాహ్ సాటిలేనివాడు. ఆకాశాలను అంత ఎత్తున అపురూపంగా నిర్మించింది, అందులో అందమైన నక్షత్రాలను, గ్రహాలను ఏర్పరచింది ఆయనే. అలాగే భూమిలో పర్వతాలను మేకులుగా పాతిపెట్టినవాడు, భూమిలో నదులను, కాలవలను, సెలయేళ్లను ప్రవహింపజేసేవాడు, రకరకాల వృక్షాలను మొలకెత్తించేవాడు, పంటల్ని పండించేవాడు, వివిధ రకాల జంతువులను సృష్టించినవాడు కూడా ఆయనే. ఆకాశం నుంచి వర్షపు నీటిని కురిపించి తద్వారా అందమైన తోటలను ఉత్పన్నం చేసేవాడు కూడా ఆయనే కదా! ఏమిటీ, మీలో ఎవరయినా ఈ భూమండలంలో దైవప్రమేయం లేకుండా ఒక్క తోటనయినా సృజించగలరా? ఈ విషయాలను ఆనాటి ముష్రిక్కులు కూడా ఒప్పుకునేవారు (ఉదాహరణకు : అన్‌కబూత్ : 63).

80. ఇన్ని వాస్తవాలు తెలిసిన తరువాత కూడా అల్లాహ్‌తోపాటు మరొక దేవుడున్నాడని మీరు అనుకుంటున్నారా? లేక మీరు పూజిస్తున్న ఆ చిల్లర దేవుళ్లు ఈ వస్తువులలో ఏ ఒక్క దానినైనా సృష్టించారా? లేదుకదా! మరలాంటప్పుడు మీరు వారిని పూజలకు అర్హులుగా ఎలా నిలబెట్టుకున్నారు?

اَمَّنْ يُّجِيْبُ الْمُضْطَرَّ اِذَا دَعَاهُ وَيَكْشِفُ السُّوْٓءَ وَيَجْعَلُكُمْ خُلَفَآءَ الْاَرْضِ ءَاِلٰهٌ مَّعَ اللّٰهِ قَلِيْلًا مَّا تَذَكَّرُوْنَ ﴿٦٢﴾

**62** కలత చెందినవాడు మొరపెట్టుకున్నప్పుడు, అతని మొరను ఆలకించి, అతని వ్యాకులతను దూరం చేసేవాడెవడు?[84] మిమ్మల్ని భూమికి ప్రతినిధులుగా చేసేవాడెవడు?[85] ఏమిటీ, అల్లాహ్‌తో పాటు మరో ఆరాధ్య దేవుడు కూడా ఉన్నాడా? మీరు మాత్రం గుణపాఠం గ్రహించేది బహు తక్కువ.

81. వారు రుజుమార్గం నుంచి తొలగిపోయి, చిల్లర దేవుళ్ళను అల్లాహ్‌కు భాగస్థులుగా కల్పిస్తున్నారని కూడా అర్థం వస్తుంది.

82. భూమిని నివాసయోగ్యంగా చేయటమంటే అర్థం – మనుగడకు, జీవితానికి అనుకూలంగా మలచటం అన్నమాట! భూమిని చూడండి, అది స్థిరంగా ఉంది. అందులో చలనంగానీ, ప్రకంపనంగానీ లేదు. అందులో పెద్ద పెద్ద పర్వతాలను ప్రతిష్ఠించటంలో కూడ ఎన్నో పరమార్థాలున్నాయి. భూమిలో చలనం, అస్థిరత్వం ఏర్పడకుండా పర్వతాలు ఆపి ఉంచాయి. అందులో ప్రవహించే నదీనదాలు, కాలువలు ప్రజల జీవితావసరాలను తీరుస్తున్నాయి. ఇన్ని అద్భుతమైన ఏర్పాట్లను చేసిన అల్లాహ్‌ను కాదని వేరితర దైవాలను పూజించటం అజ్ఞానమే కదా!

83. దీని వివరణ కోసం అల్ ఫుర్ఖాన్ సూరాలోని 53వ ఆయతుకు ఇవ్వబడిన వివరణను చూడండి.

84. మానవుడు పైకి ఎన్ని 'కబుర్లు' చెప్పినా కష్టాలలో చిక్కుకున్నప్పుడు, దిక్కుతోచని దుస్థితి ఏర్పడినప్పుడు మటుకు తాను నమ్ముకునే మిథ్యా దైవాలన్నింటినీ వదలిపెట్టి నిజదైవం వైపుకు మరలుతాడు. తన ఆరాధనలన్నింటినీ ఆయన కొరకే ప్రత్యేకించుకుని మరీ అభ్యర్థించుకుంటాడు. మరిన్ని వివరాల కోసం ఇస్రా సూరా 67వ వచనాన్ని, అన్ నహ్ల్ సూరా 53వ వచనాన్ని చూడండి.

85. అల్లాహ్‌యే కదా! ఆయన ఒక అనుచర సమాజం తరువాత మరో అనుచర సమాజాన్ని, ఒక జాతి తరువాత మరో జాతిని, ఒక తరం తరువాత మరో తరాన్ని ఉనికిలోకి తెస్తుంటాడు. అలాగాకుండా ఆయన అందరినీ ఒకేసారి ప్రభవింపజేస్తే భూమి తట్టుకోజాలదు. ఆర్థిక సంక్షోభం తలెత్తుతుంది. ఒనరులు చాలక ప్రజలు ఇక్కట్ల పాలవుతారు. తమ మనుగడ కోసం భువిలో అరాచకం సృష్టిస్తారు. ఇలాంటి అస్తవ్యస్త స్థితి నెలకొనరాదన్న ఉద్దేశంతోనే దేవుడు తన ప్రణాళిక ననుసరించి ఒక జాతి తరువాత మరోజాతిని ఉనికిలోకి తెస్తుంటాడు.

أَمَّنْ يَهْدِيكُمْ فِي ظُلُمٰتِ الْبَرِّ وَالْبَحْرِ وَمَنْ يُرْسِلُ
الرِّيٰحَ بُشْرًا بَيْنَ يَدَيْ رَحْمَتِهِ ۗ ءَاِلٰهٌ مَّعَ اللّٰهِ ۗ
تَعٰلَى اللّٰهُ عَمَّا يُشْرِكُوْنَ ﴿٦٣﴾

**63** భూమిపైన, సముద్రంపైన– అలుము కున్న చీకట్లలో మీకు దారి చూపేవాడెవడు?[86] తన కారుణ్యానికి (వర్షానికి) ముందే శుభవార్తల్ని అందజేసే గాలులను పంపేవాడెవడు?[87] ఏమిటీ, అల్లాహ్‌తో పాటు వేరొక ఆరాధ్య దేవుడు కూడా ఉన్నాడా? వారు కల్పించే భాగస్వామ్యాలకు అల్లాహ్ అతీతుడు, ఉన్నతుడు.

أَمَّنْ يَبْدَؤُا الْخَلْقَ ثُمَّ يُعِيدُهُ وَمَنْ يَرْزُقُكُمْ مِّنَ
السَّمَآءِ وَالْأَرْضِ ۗ ءَاِلٰهٌ مَّعَ اللّٰهِ ۗ قُلْ هَاتُوا بُرْهَانَكُمْ
اِنْ كُنْتُمْ صٰدِقِيْنَ ﴿٦٤﴾

**64** చెప్పండి, తొలిసారి సృష్టిని చేసినదెవరు? మళ్ళీ దాన్ని పునరావృతం చేయగలవాడెవడు?[88] భూమ్యాకాశాల నుంచి మీకు ఉపాధిని (ఆహార వనరులను) సమకూర్చేవాడెవడు?[89] ఏమిటీ, అల్లాహ్‌తో పాటు (ఈ కార్యనిర్వహణలో) ఇంకొక ఆరాధ్య దేవుడు కూడా ఉన్నాడా? మీరు సత్యవంతులే అయితే ఆ మేరకు మీ ప్రమాణం ఏదన్నా తీసుకురండి అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

86. అంటే రాత్రి చీకట్లలో మీకు మార్గదర్శకత్వం వహించేవాడు అల్లాహ్‌యే. ఆయన ఆకాశంలో మెరిసే నక్షత్రాలను సృజించి, మీరు మీ గమ్యస్థానాలకు చేరుకునేలా చేస్తున్నాడు. అలాగే కొండలను, పర్వతాలను, పర్వత కనుమలను పుట్టించింది కూడా ఆయనే. అవి సరిహద్దు రేఖలుగా, వేర్వేరు ప్రదేశాల మధ్య ప్రకృతిసిద్ధ మార్గాలుగా కూడా ఉపయోగపడుతున్నాయి.

87. వర్షానికి ముందు చల్లని గాలులు శుభవార్తను మోసుకువస్తాయి. అప్పటి వరకూ మండుటెండలకు మాడిన మనుషులు, పశువులు, పక్షులు – అందరూ ఆ చల్లని గాలులను తనివితీరా ఆస్వాదిస్తాయి. ఆహ్లాదాన్ని పొందుతాయి.

88. అంటే, ప్రళయదినాన ఆయన మీకు మలిసారి జీవితాన్ని ప్రసాదిస్తాడు.

89. ఆకాశం నుంచి వర్షం కురిపించి, నేలలో నిక్షిప్తమైవున్న ఖజానాలను (నవ ధాన్యాలను, పండ్లు ఫలాలను) ఉత్పన్నం చేసేవాడు అల్లాహ్‌యే. ఆయన తాను కోరినవారిపై, కోరినంతగా భూమ్యాకాశాల శుభాల ద్వారాలను తెరుస్తాడు.

قُلْ لَّا يَعْلَمُ مَنْ فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ الْغَيْبَ اِلَّا اللّٰهُ ۚ
وَمَا يَشْعُرُوْنَ اَيَّانَ يُبْعَثُوْنَ ﴿٦٥﴾

**65** “అల్లాహ్‌కు తప్ప ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న వారెవరికీ అగోచర జ్ఞానం లేదు.[90] తాము ఎప్పుడు తిరిగి లేపబడతామో కూడా వారికి తెలియదు” అని ఓ ప్రవక్తా (స) వారికి చెప్పు.

بَلِ ادّٰرَكَ عِلْمُهُمْ فِي الْاٰخِرَةِ ۚ بَلْ هُمْ فِيْ شَكٍّ
مِّنْهَا ۚ بَلْ هُمْ مِّنْهَا عَمُوْنَ ﴿٦٦﴾

**66** అసలు పరలోకానికి సంబంధించి వారి జ్ఞానం స్థంభించిపోయింది.[91] పైగా దాని గురించి వారు సంశయంలో పడి ఉన్నారు. కాదు, దానిపట్ల వారు అంధులైపోయారు.[92]

90. ఏ విధంగానయితే అల్లాహ్ తన సృష్టి ప్రక్రియలో, పోషకత్వంలో, కరుణానుగ్రహాలలో సాటిలేనివాడో అదేవిధంగా రహస్య జ్ఞానం విషయంలో కూడా సాటిలేనివాడు. దేవుడు తన ప్రవక్తలకైనా, దైవదూతలకైనాసరే ఏ మేరకు జ్ఞాన సంపదను ఇస్తాడో ఆ మేరకే వారికి తెలిసి ఉంటుంది. అంతకుమించిన రహస్య జ్ఞానం వారికి సయితం తెలిసి ఉండదు. ఆలిముల్ గైబ్ (రహస్య విషయాల జ్ఞాని) అల్లాహ్ మాత్రమే. ప్రతి విషయం గురించి తెలిసినవానిని, అతి గోప్యమైన విషయం గురించి కూడా తెలిసివున్నవానిని మాత్రమే ‘అగోచర జ్ఞాని’ అంటారు. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా అన్నారు : “రేపు ఏం జరగబోతుందో కూడా మహాప్రవక్త ముహమ్మద్ (స)కు తెలుసని ఎవడంటాడో అతను అల్లాహ్‌కు అతి పెద్ద అబద్ధాన్ని అంటగట్టాడు. ఎందుకంటే అల్లాహ్ స్వయంగా ఈ విధంగా అంటున్నాడు – ‘భూమ్యాకాశాలలో అగోచర విషయాల జ్ఞానం కేవలం అల్లాహ్‌కే ఉంది’ (సహీహ్ బుఖారీ – హ.నెం. 4855; సహీహ్ ముస్లిం – హ.నెం. 287; తిర్మిజీ – హ.నెం. 3068)

హజ్రత్ ఖతాదా (రజి) ఇలా అంటున్నారు : నక్షత్రాలు మూడు లక్ష్యాల కోసం నిర్మించబడ్డాయి – 1. ఆకాశానికి శోభాయమానంగా. 2. మార్గదర్శక సాధనాలుగా. 3. షైతానులను తరిమికొట్టేవిగా. అయితే దైవాదేశాల గురించి తెలియని స్వార్థపరులు కొందరు ఈ నక్షత్రాల ద్వారా అగోచరజ్ఞానాన్ని ఆర్జించే (జోస్యం చెప్పే) పనిని మొదలెట్టారు. ఉదాహరణకు : ఫలానా నక్షత్ర సమయాన వివాహం జరిగితే ఫలానా నష్టం జరుగుతుందనీ, ఫలానా ముహూర్తాన ప్రయాణానికి బయలుదేరితే కీడు జరుగుతుందనీ, ఫలానా సమయంలో పుడితే అశుభ సూచకమని ఏదేదో చెబుతుంటారు. అవన్నీ ఉత్తుత్తి మాటలే. వారు చెప్పేవి తరచూ అబద్ధాలుగా కూడా తేలుతుంటాయి. భూమ్యాకాశాలలో అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ అగోచర జ్ఞానం లేదని అల్లాహ్ స్వయంగా చెబుతుండగా చిలకల ద్వారా, నక్షత్రాల ద్వారా, పాచికల ద్వారా ఈ జ్ఞానం ఎలా ఆర్జించబడుతుంది? (ఇబ్నె కసీర్).

**67** అవిశ్వాసులు ఇలా అన్నారు : "ఏమిటీ, మేమును, మా తాతముత్తాతలూను మట్టిగా మారిపోయిన తరువాత కూడా మమ్మల్ని మళ్లీ బయటికి తీయటం జరుగుతుందా?

وَقَالَ الَّذِينَ كَفَرُوٓا أَءِذَا كُنَّا تُرَٰبًا وَءَابَآؤُنَآ أَئِنَّا لَمُخْرَجُونَ ﴿٦٧﴾

**68** "చాలా కాలంగా మాకు, మా తాతముత్తాతలకు కూడా ఇలాంటి వాగ్దానాలే చేయబడుతూ వచ్చాయి. ఇవి పూర్వీకుల కట్టుకథలు తప్ప మరేమీ కావు."[93]

لَقَدْ وُعِدْنَا هَٰذَا نَحْنُ وَءَابَآؤُنَا مِن قَبْلُ إِنْ هَٰذَآ إِلَّآ أَسَٰطِيرُ الْأَوَّلِينَ ﴿٦٨﴾

**69** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "అపరాధులకు పట్టిన గతేమిటో కాస్త భూమిలో సంచరించి చూడండి!"[94]

قُلْ سِيرُوا فِي الْأَرْضِ فَانظُرُوا كَيْفَ كَانَ عَٰقِبَةُ الْمُجْرِمِينَ ﴿٦٩﴾

91. అంటే పరలోకం ఎప్పుడు సంభవిస్తుంది? అన్న విషయం ఎవరికీ తెలియదు. హ(జత్ జి(బయీల్ (అలైహిస్సలాం) (పళయం సంభవించే విషయమై మహా (పవక్త (సఅసం)ను అడిగితే, "దీని గురించి చెప్పేవానికి అడిగేవానికన్నా ఎక్కువేమీ తెలీదు" అని అన్నారు. లేక దీనికి మరో అర్థం ఇది : వారి జ్ఞానం అక్కడితో ఆగిపోయింది. ఎందుకంటే (పళయం గురించి చేయబడిన వాగ్దానాలను వారు తమ కళ్లారా చూసుకున్నారు. అందువల్ల పరలోకం గురించిన జ్ఞానం ఇప్పుడు వారికి ఏవిధంగానూ (పయోజనకారి కాజాలదు. ఎందుకంటే (పపంచంలో వారు నిరంతరం దాన్ని ధిక్కరిస్తూ ఉండేవారు. "వారు మా ముందు హాజరయ్యే రోజున వారి చెవులు కూడా బాగానే వింటాయి. వారి కళ్లు కూడా బాగానే చూస్తాయి. కాని ఈనాడు దుర్మార్గులు మార్గ(భష్టత్వంలో పడి ఉన్నారు." (మర్యమ్ – 38)

92. (పాపంచిక వ్యామోహంలో దారుణంగా చిక్కుకుని ఉన్న వీళ్ళకు పరలోకం గురించి చెబితే అర్థం కావటం లేదు. పైగా పరలోకం అనేసరికి రకరకాల సందేహాలను లేవనెత్తుతారు. ఇక్కడికొచ్చేసరికి వారి బుద్ధిజ్ఞానాలు స్థంభించిపోతున్నాయి. వారి మనోనే(తం మూసుకుపోతుంది.

93. ఇందులో వాస్తవం ఏమీ లేదు. ఈ కథలను ఒకరినుంచి ఇంకొకరు విని జనులకు చెబుతూ వస్తున్నారంతే!

94. అవిశ్వాసుల మాటలకు ఈ వాక్యంలో సమాధానం ఇవ్వబడింది. ఏమిటీ, ధిక్కార వైఖరిని అవలంబించిన వారికి ఏ గతిపట్టిందో మీరు భూమిలో తిరిగి చూడరా?! వినాశాన్ని చవిచూసిన జాతుల గాథలు మీకు గుణపాఠం కావటంలేదా? దైవ (పవక్తలు సత్యవంతులని చెప్పడానికి ఈ ఉదాహరణలు చాలవా? గతించిన జాతుల

**70** నువ్వు వాళ్ల గురించి దుఃఖించకు. వాళ్లు పన్నే కుట్రలకు కూడా నీకు మనస్తాపం కలగకూడదు.

وَلَا تَحْزَنْ عَلَيْهِمْ وَلَا تَكُنْ فِي ضَيْقٍ مِّمَّا يَمْكُرُونَ ﴿٧٠﴾

**71** “మీరు చెప్పేదే నిజమైతే ఆ వాగ్దానం ఎప్పుడు నెరవేరుతుందో?” అని వారు (వెటకారంగా) అంటున్నారు కదూ!

وَيَقُولُونَ مَتَىٰ هَٰذَا الْوَعْدُ إِن كُنتُمْ صَادِقِينَ ﴿٧١﴾

**72** “మీరు వేటిని గురించి తొందర పెడు తున్నారో వాటిలో కొన్ని విషయాలు బహుశా మీకు అత్యంత సమీపంలోనే ఉన్నాయేమో!”[95] అని వారికి సమాధానం ఇవ్వు.

قُلْ عَسَىٰ أَن يَكُونَ رَدِفَ لَكُم بَعْضُ
الَّذِي تَسْتَعْجِلُونَ ﴿٧٢﴾

**73** వాస్తవానికి నీ ప్రభువు మానవులపై ఎంతో దయగలవాడు. కాని వారిలో చాలా మంది కృతజ్ఞులుగా మెలగరు.[96]

وَإِنَّ رَبَّكَ لَذُو فَضْلٍ عَلَى النَّاسِ وَلَٰكِنَّ
أَكْثَرَهُمْ لَا يَشْكُرُونَ ﴿٧٣﴾

**74** నిశ్చయంగా నీ ప్రభువుకు వారి ఆంత ర్యాలు దాచి ఉంచేవీ తెలుసు, బహిర్గతం చేసేవి కూడా తెలుసు.

وَإِنَّ رَبَّكَ لَيَعْلَمُ مَا تُكِنُّ صُدُورُهُمْ وَمَا يُعْلِنُونَ ﴿٧٤﴾

**75** భూమ్యాకాశాలలో దాగివున్న ఏ వస్తువు కూడా స్పష్టమైన ఒక గ్రంథంలో నమోదవకుండా లేదు.[97]

وَمَا مِنْ غَائِبَةٍ فِي السَّمَاءِ وَالْأَرْضِ إِلَّا فِي
كِتَابٍ مُّبِينٍ ﴿٧٥﴾

గురించి మా ప్రవక్తలు చెప్పేది నిజమైనట్లే పరలోకం గురించి, మరణానంతర జీవితం గురించి చెప్పేది కూడా నిజమే.

95. బహుశా బద్ర్ యుద్ధంలో అవిశ్వాసులకు ఎదురుకానున్న పరాభవాన్ని గురించి ఇందులో సంకేతం ఇవ్వబడి ఉండవచ్చు. లేదా సమాధి యాతనను దృష్టిలో పెట్టుకుని ఈ విధంగా అనబడి ఉంటుంది. **‘రదిఫ’** ( رَدِفَ ) అంటే దగ్గరవటం అని అర్థం. వాహనంపై చోదకుని వెనుక కూర్చునే వ్యక్తిని ‘రదీఫ్’ అని పిలుస్తారు.

96. మనుషులు తలబిరుసులుగా ప్రవర్తించినా, వారిని తక్షణమే పట్టుకోకుండా వారికి కొంత గడువు ఇవ్వటం కూడా దేవుని గొప్ప అనుగ్రహమే. కాని జనులు ఈ ‘విడుపు’ను, ఈ ఉపేక్షను దుర్వినియోగం చేసుకోవటం కడు శోచనీయం.

97. **‘స్పష్టమైన గ్రంథం’** అంటే ‘లౌహె మహ్‌ఫూజ్’ అన్నమాట! గోప్యమైన ఎన్నో వస్తువుల గురించి అందులో పొందుపరచబడి ఉంది. దేవుడు దుర్మార్గులకు విధించే యాతన

76 నిశ్చయంగా ఈ ఖుర్‌ఆన్ ఇస్రాయీలు వంశీయులకు వారు విభేదించుకునే ఎన్నో విషయాల (లోని వాస్తవికత)ను విడమరచి చెబుతున్నది.[98]

إِنَّ هَٰذَا الْقُرْآنَ يَقُصُّ عَلَىٰ بَنِي إِسْرَائِيلَ أَكْثَرَ الَّذِي هُمْ فِيهِ يَخْتَلِفُونَ ﴿٧٦﴾

77 ఇంకా నిస్సందేహంగా ఈ ఖుర్‌ఆన్ విశ్వాసుల కొరకు మార్గదర్శిగానూ, కారుణ్యంగానూ ఉన్నది.[99]

وَإِنَّهُ لَهُدًى وَرَحْمَةٌ لِّلْمُؤْمِنِينَ ﴿٧٧﴾

78 నీ ప్రభువు వీరి మధ్య తన ఆజ్ఞాను సారం తీర్పు చేస్తాడు.[100] ఆయన అత్యంత శక్తిసంపన్నుడు, అన్నీ తెలిసినవాడు.

إِنَّ رَبَّكَ يَقْضِي بَيْنَهُم بِحُكْمِهِ ۚ وَهُوَ الْعَزِيزُ الْعَلِيمُ ﴿٧٨﴾

గురించి కూడా అందులో వ్రాయబడి ఉంది. అయితే ఆ ఘడియ ఎప్పుడు వస్తుంది? అది కూడా అల్లాహ్‌కే తెలుసు. ఏ జాతినయినా శిక్షించవలసిన సమయాన్ని ఆయన అందులో ఒకసారి నిర్ధారించిన తరువాత, ఇక అది వాయిదా వెయ్యబడటం అనేది జరగదు. అలాంటప్పుడు ఆ నిర్ణీత ఘడియ గురించి అవిశ్వాసులు హడావిడి చేయాల్సిన అవసరం లేదు. సంభవించవలసిన క్షణాన అది తప్పకుండా సంభవిస్తుంది.

98. గ్రంథం కల ప్రజలైన యూదులు, క్రైస్తవులు వివిధ వర్గాలుగా, తెగలుగా చీలిపోయారు. వారి విశ్వాసాలు కూడా ఒండొకరికి భిన్నంగా ఉండేవి. ఇటు యూదులు ఈసా (అలైహిస్సలాం)ను తెగనాడుతుంటే, అటు క్రైస్తవులు ఈసా (ఏసుక్రీస్తు)ను పొగడటంలో అతిశయిల్లేవారు. తుదకు ఏసుక్రీస్తును దేవునిగా, దేవుని కుమారునిగా ఖరారు చేశారు. అట్టి పరిస్థితిలో దివ్య ఖుర్‌ఆన్ ఆ విషయాలలోని నిజానిజాలను విడమరచి చెప్పింది. దివ్య ఖుర్‌ఆన్ వివరించిన ఆ నిజాలను గనక వారు ఒప్పుకుంటే, వారి మధ్య గల సైద్ధాంతిక విభేదాలన్నీ సమసిపోతాయి.

99. **'విశ్వాసుల కొరకు'** అని ప్రత్యేకంగా ఎందుకు చెప్పబడిందంటే, విశ్వసించిన వారే నిజభావంలో ఖుర్‌ఆన్ మాధుర్యాన్ని ఆస్వాదించగలుగుతారు. ఈ మాధుర్యాన్ని ఆస్వాదించే వారిలో ఇస్రాయీల్ సంతతిలోని విశ్వసించిన వారు కూడా ఉన్నారు.

100. అంటే తీర్పుదినాన అల్లాహ్ వారి మధ్య గల విభేదాలపై, వివాదాలపై అంతిమ నిర్ణయం గైకొని సత్యాన్ని అసత్యం నుంచి వేరుపరుస్తాడు. ఆ నిర్ణయం ప్రకారమే ఆయన శిక్షా బహుమానాలను నిర్ధారిస్తాడు. లేదా వారు తమ గ్రంథాలలో చేసిన ప్రక్షిప్తాల బండారాన్ని ప్రపంచంలో బట్టబయలుచేసి, వాళ్ళ నిజస్వరూపాన్ని బయటపెడతాడు.

**79** కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు అల్లాహ్ పైనే భారం మోపు. ముమ్మాటికీ నువ్వు స్పష్టమైన సత్యపథాన ఉన్నావు.[101]

فَتَوَكَّلْ عَلَى اللّٰهِ ۭ اِنَّكَ عَلَى الْحَقِّ الْمُبِيْنِ ۝

**80** నువ్వు మృతులకు వినిపించలేవు.[102] అలాగే వీపు తిప్పుకుని, విముఖతను ప్రదర్శిస్తూ పోయే చెవిటి వారికి కూడా నువ్వు నీ పిలుపును వినిపించలేవు.[103]

اِنَّكَ لَا تُسْمِعُ الْمَوْتٰى وَلَا تُسْمِعُ الصُّمَّ الدُّعَاۗءَ اِذَا وَلَّوْا مُدْبِرِيْنَ ۝

101. అంటే నీ వ్యవహారాన్ని నీ ప్రభువుకే అప్పగించు. ఆయన్ని నమ్ముకో. సర్వదా నీకు సహాయపడేవాడు ఆయనే. ఎందుకంటే నువ్వు సత్యమార్గంపై ఉన్నావు. అందువల్ల నువ్వు జంకవలసిన పని లేదు.

102. ఈ అవిశ్వాసుల పెడసరి పోకడలను లక్ష్యపెట్టకుండా కేవలం అల్లాహ్‌పై భారం మోపు. ఎందుకంటే వాళ్లు మృత కళేబరాల్లాంటివారు. వారు ఎవరి మాటనయినా విని ప్రయోజనం పొందలేరు. లేదా వారు చెవిటివారు. వినలేరు, అర్థం చేసుకోలేరు. ఈ ఆయతులో అవిశ్వాసులు మృతులతో పోల్చబడ్డారు. మృతులలో స్పందనగానీ, వివేచనగానీ ఉండదు. అలాగే వారు చెవిటివారుగా అభివర్ణించబడ్డారు. చెవిటివారు ఉపదేశాన్ని విననూలేరు, అర్థం చేసుకోనూలేరు.

103. వారు సత్యం పట్ల ద్వేషాన్ని వెళ్లగ్రక్కుతున్నారు. చెవిటివారు అసలే మాటను వినలేరు. పైగా ఆ చెవిటివారిలో వైముఖ్యధోరణి, తలబిరుసుతనం కూడా ఉంటే పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో ఊహించండి! ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయతు ద్వారా తెలిసే మరో ముఖ్య విషయం ఏమంటే మృతులు వింటాయి అనే నమ్మకం ఖుర్‌ఆన్‌కు విరుద్ధమైనది. మృతులు ఎవరి మాటనూ వినలేవు. కాకపోతే కొన్ని ప్రత్యేక సందర్భాలలో దీనికి మినహాయింపు ఉంది. ప్రామాణిక ఆధారాల ద్వారా నిరూపితమై ఉన్న ఆ ప్రత్యేక సందర్భాలను మినహాయిస్తే–సాధారణంగా – మృతులకు వినేశక్తి ఉండదు. ఉదాహరణకు హదీసు ప్రకారం, మరణించిన వ్యక్తిని జనులు ఖననం చేసి తిరిగివస్తున్నప్పుడు, ఆ మృతుడు వారి చెప్పుల సవ్వడిని వింటాడు. (సహీహ్ బుఖారీ–హ.నెం. 338; సహీహ్ ముస్లిం – 2201). అలాగే బద్ర్ యుద్ధ సందర్భంగా వధించబడిన అవిశ్వాసులను ఉద్దేశించి మహాప్రవక్త (సఅసం) కొన్ని మాటలు పలికారు. అప్పుడు ఆయన ప్రియసహచరులు (రజి), "తమరు నిర్జీవమైన భౌతిక కాయాలతో సంభాషిస్తున్నారా?" అని అన్నారు. "వారు మీకన్నా ఎక్కువగా నా మాటను వింటున్నారు" అని మహాప్రవక్త (స) సెలవిచ్చారు. అంటే ఆ సమయంలో అల్లాహ్ అద్భుతమైన రీతిలో ఆయన (స) మాటలను అవిశ్వాసులైన మృతులకు వినిపించాడు (సహీహ్ బుఖారీ – 1307).

**81** గుడ్డివారిని కూడా నువ్వు వారి అపమార్గం నుంచి మళ్ళించి, సన్మార్గానికి తేలేవు.[104] మా ఆయతులను విశ్వసించి, విధేయత చూపేవారికి మాత్రమే నువ్వు (నీ వాణిని) వినిపించగలవు.

وَمَآ أَنْتَ بِهٰدِي الْعُمْيِ عَنْ ضَلٰلَتِهِمْ ۗ إِنْ تُسْمِعُ إِلَّا
مَنْ يُّؤْمِنُ بِاٰيٰتِنَا فَهُمْ مُّسْلِمُوْنَ ﴿٨١﴾

**82** వారిని శిక్షించే మాట ఖరారు అయినప్పుడు,[105] మేము వారి కోసం భూమి నుండి ఒక జంతువును వెలికి తీస్తాము. అది వారితో మాట్లాడుతుంది:[106] ఎందుకంటే ప్రజలు మా ఆయతులను నమ్మేవారు కారు.[107]

وَإِذَا وَقَعَ الْقَوْلُ عَلَيْهِمْ أَخْرَجْنَا لَهُمْ دَآبَّةً مِّنَ
الْأَرْضِ تُكَلِّمُهُمْ ۙ أَنَّ النَّاسَ كَانُوْا بِاٰيٰتِنَا
لَا يُوْقِنُوْنَ ﴿٨٢﴾

**83** ఆ రోజు మేము ప్రతి మానవ సమాజం నుంచి, మా ఆయతులను ధిక్కరించే ఒక్కొక్క సమూహాన్ని చుట్టుముట్టి మరీ తెస్తాము. ఆ తరువాత వారంతా వర్గీకరించబడతారు.[108]

وَيَوْمَ نَحْشُرُ مِنْ كُلِّ أُمَّةٍ فَوْجًا مِّمَّنْ
يُّكَذِّبُ بِاٰيٰتِنَا فَهُمْ يُوْزَعُوْنَ ﴿٨٣﴾

104. అంటే అల్లాహ్ ఎవరినయితే సత్యం పట్ల అంధునిగా చేసివేశాడో, వారిని నువ్వు సన్మార్గానికి తేలేవు. వారు విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదించలేరు.

105. అప్పుడు మంచిని ప్రబోధించేవారు, చెడుల నుంచి ఆపేవారు ఎవరూ ఉండరు.

106. ప్రళయదినం సమీపించిందని తెలిపే సూచనలలో ఆ జంతువు ఒకటి. హదీసు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది. "మీరు పది సూచనలను చూడనంత వరకూ ప్రళయం సంభవించదు. వాటిలో ఒకటి : జంతువు వెలికి రావటం" అని అంతిమ దైవప్రవక్త (సఅసం) వారు ప్రవచించారు (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఫితన్). వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది – "అన్నిటికన్నా మొట్టమొదటి సూచన ఏమిటంటే సూర్యుడు తూర్పుదిక్కు నుంచి కాకుండా పడమటి దిక్కున ఉదయిస్తాడు. 'చాష్త్' సమయాన జంతువు వెలికివస్తుంది. ఈ రెంటిలో ఏ సూచన మొదట ప్రస్ఫుటమైనా, రెండవ సూచన కూడా వెనువెంటనే ప్రస్ఫుటం అవుతుంది" (సహీహ్ ముస్లిం – బాబున్ ఫీ ఖురూజిద్దజ్జాల్).

107. జంతువు వెలికి రావటానికి గల కారణం ఇక్కడ తెలుపబడింది. ఎందుకంటే ప్రజలు దేవుని సూచనలను లేదా నిదర్శనాలను నమ్మేవారు కారు. మరి కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఆ జంతువు స్వయంగా "ప్రజలు మా ఆయతులను నమ్మేవారు కారు" అని

**84** వారంతా ఒకచోట చేరిన తరువాత (అల్లాహ్ ఇలా) అడుగుతాడు: "మీరు నా ఆయతులను గురించి పూర్తిగా తెలియక పోయినప్పటికీ ఎందుకు ఖండించారు?[109] ఇంతకీ మీరేం చేస్తూ ఉండేవారో చెప్పండి?"[110]

حَتّٰىٓ اِذَا جَآءُوْ قَالَ اَكَذَّبْتُمْ بِاٰيٰتِيْ وَلَمْ تُحِيْطُوْا بِهَا
عِلْمًا اَمَّاذَا كُنْتُمْ تَعْمَلُوْنَ ﴿٨٤﴾

**85** వారు చేసిన దురాగతాల మూలంగా శిక్షకు సంబంధించిన మాట వారి విషయంలో నెరవేరుతుంది. అందువల్ల వారేమీ మాట్లాడలేరు.[111]

وَوَقَعَ الْقَوْلُ عَلَيْهِمْ بِمَا ظَلَمُوْا فَهُمْ لَا يَنْطِقُوْنَ ﴿٨٥﴾

**86** వారు విశ్రాంతి తీసుకునేందుకుగాను మేము రాత్రిని చేశాము. ఇంకా పగటిని చూపగలిగేదిగా చేశాము.[112] దీనిని వారు గమనించటం లేదా? నిశ్చయంగా విశ్వసించే వారికోసం ఇందులో నిదర్శనాలున్నాయి.

اَلَمْ يَرَوْا اَنَّا جَعَلْنَا الَّيْلَ لِيَسْكُنُوْا فِيْهِ وَالنَّهَارَ مُبْصِرًا ۗ
اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيٰتٍ لِّقَوْمٍ يُّؤْمِنُوْنَ ﴿٨٦﴾

---

అంటుంది. ఖుర్ఆన్‌లో స్వయంగా ఈ మాటలుండటం వల్ల ప్రజలు దీనిపట్ల సందేహానికి లోను కావలసిన అవసరమే ఉండదు.

108. అపరాధులు, వారు చేసిన అపరాధాలనుబట్టి విభజించబడతారు. ఉదా: మద్యపాన ప్రియుల జట్టు, హంతకుల జట్టు, వ్యభిచారుల జట్టు – ఇలా వేర్వేరు జట్లుగా వర్గీకరించబడతారు. లేదా వారు ఒకే చోట మంద వేయబడతారు. ముందు వైపుకుగానీ, వెనుక వైపుకు గానీ, కుడి వైపుకుగానీ, ఎడమ వైపుకు గానీ వెళ్ళకుండా ఆపబడతారు. ఆ విధంగా వారిలోని ఒక్కొక్క గుంపూ వరుసగా నరకానికి ఆహుతి చేయబడుతుంది.

109. అంటే – మీరు నా అభిమతాన్ని, ఏకత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఏ విధంగా ప్రయత్నించాలో ఆ విధంగా ప్రయత్నించలేదు. ప్రయత్నించకుండానే – స్థూల దృష్టితో – నా ఆయతులను త్రోసిపుచ్చారు. అందువల్ల నా సందేశంలోని మాధుర్యాన్ని ఆస్వాదించే భాగ్యం మీకు లభించలేదని దేవుడంటాడు.

110. మీరు నా సందేశాన్ని గురించి చిత్తశుద్ధితో ఎందుకు ఆలోచించలేదు? మీరు ఏ ముఖ్యమైన పనుల్లో తలమునకలై ఉండటం వల్ల దీన్ని విస్మరించారో చెప్పండి?!

111. వారి దగ్గర సరైన సంజాయిషీ ఏదీ లేకుండా పోతుంది. లేదా ప్రళయదినం నాటి భయంకర సన్నివేశాల మూలంగా వారికి ఎటూ పాలుపోదు. మరికొంతమంది

**87** శంఖం ఊదబడే రోజున ఆకాశాలలో ఉన్నవారు, భూమిపై ఉన్న వారంతా భీతావహులై పోతారు[113] – కాని అల్లాహ్ తలచిన వారికి మాత్రం ఆ స్థితి ఏర్పడదు.[114] అందరూ (అశక్తులై), కడు వినమ్రులై ఆయన ముందు హాజరవుతారు.

وَيَوْمَ يُنْفَخُ فِي الصُّوْرِ فَفَزِعَ مَنْ فِي السَّمٰوٰتِ وَمَنْ فِي الْاَرْضِ اِلَّا مَنْ شَآءَ اللّٰهُ ۭ وَكُلٌّ اَتَوْهُ دٰخِرِيْنَ ۝٨٧

**88** నీవు పర్వతాలను చూచి, అవి ఉన్న చోటే స్థిరంగా ఉంటాయని అనుకుంటున్నావు. కాని అవి కూడా మేఘమాలికల్లా తేలిపోతుంటాయి.[115] ఇది అల్లాహ్ పనితనం, ఆయన ప్రతి వస్తువును చాలా గట్టిగా చేశాడు.[116] మీరు చేసేదంతా ఆయనకు తెలుసు.

وَتَرَى الْجِبَالَ تَحْسَبُهَا جَامِدَةً وَّهِيَ تَمُرُّ مَرَّ السَّحَابِ ۭ صُنْعَ اللّٰهِ الَّذِيْٓ اَتْقَنَ كُلَّ شَيْءٍ ۭ اِنَّهٗ خَبِيْرٌۢ بِمَا تَفْعَلُوْنَ ۝٨٨

---

వ్యాఖ్యాతల ప్రకారం ఆనాడు అపరాధుల నోళ్ళకు సీలు వేయబడుతుంది. తత్కారణంగా వారు ఏమీ చెప్పలేకపోతారు.

112. ప్రజలు ఉపాధి మార్గాలను అన్వేషించేందుకుగాను మేము పగలును ప్రకాశవంతంగా చేశాము.

113. శంఖం అంటే దైవాజ్ఞపై హజ్రత్ ఇస్రాఫీల్ (అలైహిస్సలాం) ఊదే కొమ్ము అని భావం. ఈ శంఖారావం రెండు లేక రెండుసార్లకన్నా ఎక్కువే ఉంటుంది. మొదటిసారి శంఖారావానికి యావత్ప్రపంచం భీతిల్లి స్పృహ కోల్పోతుంది. రెండవసారి శంఖం ఊదగానే అందరూ మృత్యువు ఒడిలోకి జారుకుంటారు. మూడవసారి శంఖారావానికి అందరూ సమాధులలో నుంచి లేచి నిలబడతారు. మరికొంతమంది ప్రకారం నాల్గవసారి శంఖం ఊదగానే అందరూ మహ్షర్ మైదానంలో చేరతారు. ఈ ఆయతులో పేర్కొనబడిన శంఖారావం ఎన్నోది? ఇమామ్ ఇబ్నె కసీర్ దృష్టిలో ఇది మొదటిది. ఇమామ్ షౌకానీ దృష్టిలో ఇది మూడవది. ఈ మూడవసారి శంఖారావంతో అందరూ సమాధులలో నుంచి లేచివస్తారు.

114. భీతావహస్థితి నుంచి సురక్షితంగా ఉండేవారు ఎవరు? వారు దైవప్రవక్తలు, అమరగతులు అని కొందరు అభిప్రాయపడగా, దైవదూతలు అని మరికొందరు అభిప్రాయపడ్డారు. విశ్వాసులంతా ఆ కళవళ స్థితినుంచి సురక్షితంగా ఉంటారని ఇంకొందరు భావిస్తున్నారు. పైన పేర్కొనబడిన వారంతా ఈ ప్రత్యేక జాబితాలో

مَنْ جَآءَ بِالْحَسَنَةِ فَلَهٗ خَيْرٌ مِّنْهَا ۚ وَهُمْ مِّنْ فَزَعٍ يَّوْمَئِذٍ اٰمِنُوْنَ ﴿٨٩﴾

**89** ఎవరయితే మంచిని తీసుకువస్తారో వారికి దానికంటే ఉత్తమమైన ప్రతిఫలం లభిస్తుంది. వారు ఆనాటి భయోత్పాతం నుండి సురక్షితంగా ఉంటారు.[117]

وَمَنْ جَآءَ بِالسَّيِّئَةِ فَكُبَّتْ وُجُوْهُهُمْ فِي النَّارِ ۗ هَلْ تُجْزَوْنَ اِلَّا مَا كُنْتُمْ تَعْمَلُوْنَ ﴿٩٠﴾

**90** మరెవరయితే చెడును తీసుకువస్తారో వారు బోర్లాగా అగ్నిలో పడవేయబడతారు. మీరు చేసుకున్న కర్మలకు తగిన ప్రతిఫలమే మీకు ఇవ్వబడుతుంది (అని వారితో అనబడుతుంది).

اِنَّمَآ اُمِرْتُ اَنْ اَعْبُدَ رَبَّ هٰذِهِ الْبَلْدَةِ الَّذِيْ حَرَّمَهَا وَلَهٗ كُلُّ شَيْءٍ ۫ وَّاُمِرْتُ اَنْ اَكُوْنَ مِنَ الْمُسْلِمِيْنَ ﴿٩١﴾

**91** నేను ఈ నగరం (మక్కా) ప్రభువును మాత్రమే ఆరాధిస్తూ ఉండాలని నాకు ఆదేశించబడింది. ఆయన దీన్ని పవిత్ర మైనదిగా చేశాడు.[118] అన్నింటికీ ఆయనే యజమాని. నేను విధేయులలో ఒకడిగా ఉండాలని కూడా నాకు ఆజ్ఞాపించ బడింది.

---

ఉంటారని ఇమామ్ షౌకానీ వ్యాఖ్యానించారు. ఎందుకంటే విశ్వసించిన పుణ్యాత్ములకు భీతి ఉండదన్న విషయం మున్ముందు రాబోతోంది.

115. ఇది ప్రళయదినం నాటి పరిస్థితి. ఆనాడు పెద్ద పెద్ద పర్వతాలు సయితం మేఘాల్లా, దూదిపింజాల్లా ఎగిరి గాలిలో తేలిపోతుంటాయి.

116. ప్రతి వస్తువును ఎంతో పకడ్బందీగా – గట్టిగా – నిర్మించటం అనేది దేవుని అద్భుత సృష్టికి ప్రబల తార్కాణం. అయితే ఎంతో గట్టిగా, స్థిరంగా ఉండే పెద్ద పెద్ద వస్తువులను సయితం అవసరమైనపుడు దూదిపింజాల్లా ఎగురవేయటం కూడా ఆయన సృష్టి మహిమలో అంతర్భాగమే.

117. అంటే వారు ఆ భయాందోళన నుంచి సురక్షితంగా ఉంటారు. “ఆ పెద్ద భయాందోళన కూడా వారిని దుఃఖానికి లోను చేయదు.” (అంబియా – 103)

118. అది మక్కా నగరం. ఈ నగరాన్ని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించటం గమనార్హం. ఈ నగరంలో పవిత్ర కాబా గృహం ఉంది. అంతిమ దైవప్రవక్త (సఅసం)కు ఈ నగరం ఎంతో ప్రియమైనది. ‘పవిత్రంగా’ చేయటమంటే అర్థం ఈ నగరంలో రక్తపాతం

**92** ఇంకా, నేను ఖుర్ఆన్‌ను పారాయణం చేస్తూ ఉండాలి (అని కూడా నాకు ఆజ్ఞా పించబడింది). సన్మార్గానికి వచ్చినవాడు తన స్వయానికి మేలు చేసుకోవటానికే సన్మార్గానికి వచ్చాడు. మరెవరయినా అపమార్గానపోతే, "నేను హెచ్చరించేవాణ్ణి మాత్రమే"[119] అని (ఓ ప్రవక్తా!) చెప్పు.

وَأَنْ أَتْلُوَا الْقُرْآنَ ۖ فَمَنِ اهْتَدَىٰ فَإِنَّمَا يَهْتَدِي لِنَفْسِهِ ۖ
وَمَن ضَلَّ فَقُلْ إِنَّمَا أَنَا مِنَ الْمُنذِرِينَ ﴿٩٢﴾

**93** ఇంకా ఈ విధంగా చెప్పు : "సర్వ స్తోత్రములు అల్లాహ్‌కే శోభిస్తాయి.[120] ఆయన త్వరలోనే తన సూచనలను మీకు చూపిస్తాడు. వాటిని మీరు స్వయంగా తెలుసుకుంటారు.[121] మీరు చేసే పనుల విషయంలో అల్లాహ్ ఏమాత్రం అజాగ్రత్తగా లేడు.[122]

وَقُلِ الْحَمْدُ لِلَّهِ سَيُرِيكُمْ آيَاتِهِ فَتَعْرِفُونَهَا ۚ وَمَا رَبُّكَ
بِغَافِلٍ عَمَّا تَعْمَلُونَ ﴿٩٣﴾

---

సృష్టించటం, వేటాడటం, అన్యాయానికి పాల్పడటం వంటివి నిషేధించబడ్డాయి. తుదకు ఇక్కడి చెట్లు నరకటం కూడా నిషిద్ధమే (బుఖారీ – కితాబుల్ జనాయెజ్; ముస్లిం – కితాబుల్ హజ్).

119. అంటే – సందేశాన్ని అందజేయటం వరకే నా పని. నా సందేశాన్ని ఆలకించి ఎవరయినా సన్మార్గం పొందితే అది అతనికే ప్రయోజనకరం. అలాంటి వ్యక్తిని దేవుడు నరకయాతన నుండి రక్షిస్తాడు. ఎవరైనా నా మాట వినకపోతే నాకు కలిగే నష్టం ఏమీలేదు. అతని లెక్క తీసుకోవడానికి అల్లాహ్ ఒక్కడే చాలు. అలాంటి మార్గభ్రష్టుల గమ్యం నరకమే.

120. ప్రశంసలు పొగడ్తలన్నీ ఆ సర్వలోక ప్రభువుకే తగును. ఎందుకంటే ఆయన గొప్ప ఉదాత్తుడు. శిక్షించటంలో ఆయన తొందరపడడు. తన దాసులకు ఆయన ఆఖరిక్షణాల వరకూ పశ్చాత్తాపం చెందే అవకాశమిస్తాడు. అప్పటికీ వారు రుజువర్తనులు కాకపోతేనే శిక్షిస్తాడు.

121. ఆ మాటే మరోచోట ఈ విధంగా చెప్పబడింది: "మేము శీఘ్రంగానే వారికి మా సూచనలను వారి పరిసరాలలో ఉన్న ప్రపంచంలోనూ చూపిస్తాము. స్వయంగా వారిలోనూ చూపిస్తాము – తద్వారా సత్యం వారి ముందు విస్పష్టమవుతుంది" (హామీమ్ సజ్దా–53). ఒకవేళ వారు జీవిత కాలంలో ఈ సూచనలను చూసి విశ్వసించక

పోయినా మరణ ఘడియల్లోనయినా ఆ సూచనలను చూసి తప్పకుండా విశ్వసిస్తారు. కాని ఆ సమయంలో అయ్యే జ్ఞానోదయం వారికేవిధంగానూ లబ్ధిని చేకూర్చదు. ఎందుకంటే గుండెలోని ప్రాణం గొంతుదాకా వచ్చేసినప్పుడు ప్రకటించే విశ్వాసం స్వీకృతి పొందదు.

122. పైగా ఆయన ఎంతో అప్రమత్తంగా ఉన్నాడు. అన్నింటినీ కనిపెట్టుకుని ఉన్నాడు. ఈ వాక్యంలో అవిశ్వాసులకు తీవ్రమైన హెచ్చరిక ఉంది.